ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శుక్రవారం 16 మే 2025



క్యూరింగ్ కొరవడిన సిమెంటు లైనింగ్ పనులు

వైభవంగా రెడ్డెమ్మతల్లి
విగ్రహ పునఃప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మ తల్లి విగ్రహ పునఃప్రతిష్ఠను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహాకుంభాభిషేక మహోత్సవంలో భాగంగా గురువారం ఉదయం శిఖర మూల విగ్రహ పునఃప్రతిష్ఠ, ప్రతిష్ఠా హోమం, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం కళా న్యాస హోమాలు, కళ న్యాసం, మహా మంగళ హారతి, సర్వదర్శనం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పట్టువస్త్రాలను తీసుకొచ్చి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాలను దాతలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సర్పంచ్ ప్రేమకుమారి, ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు, నాయకులు దద్దాల హరిప్రసాద్‌నాయుడు, చలమారెడ్డి, జగదీష్‌కుమార్, నౌషాద్, మురళీకృష్ణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



అరవీడులో పర్యటిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వారి అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం మండలంలోని అరవీడు పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని, అందులో భాగంగా సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. వెలిగల్లు ప్రాజెక్టు నుంచి అన్ని గ్రామాలకు, పల్లెలకు శాశ్వత మంచినీటి సౌకర్యం కల్పించడానికి తగిన ప్రతిపాదనలు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందచేస్తాం : జేసీ

లక్కిరెడ్డిపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): వేంపల్లి-రాయచోటి జాతీయ రహదారికి లక్కిరెడ్డిపల్లె-కోనంపేట చింతకుంటవాళ్లపల్లి గ్రామాల్లో రోడ్డుకు ఇరువైపులా ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి తక్షణమే నష్టపరిహారం చెల్లిస్తామని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో నేషనల్ హైవే నిర్మాణానికి ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ గతంలో రోడ్డుకు ఇరుపక్కలా ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారం ప్రభుత్వం అందించిందని, కేవలం పదిమంది మాత్రం సరైన సమాచారంతో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వకపోవడంతో వారికి ఇవ్వాల్సిన డబ్బులు ఆగిపోయాయని, ఆ పదిమందిని పూర్తి స్థాయిలో విచారించి నివేదికలు పంపిస్తామని వారికి కూడా త్వరలో నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆ పది మంది బాధితులు ఇప్పటికైనా సరైన ఆధారాలు, సర్వే నెంబర్లు, పట్టా నెంబర్లు ఇవ్వాలని జేసీ ఆదేశించారు. అంతేగాకుండా మిగతా 30 మంది బాధితులు స్థలాలు ఎక్కువ కోల్పోయామని, మాకు తక్కువ డబ్బులు వచ్చాయని జేసీకి తెలియజేశారు. గతంలో వేసిన అంచనాలు, రికార్డు ప్రకారమే పరిహారం ప్రభుత్వం అందించిందని, ఎక్కువ స్థలాలు కోల్పోయిన వారి స్థలాలను పరిశీలించి నివేదికలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో సీఈ క్రాంతికుమార్, నేషనల్ హైవే ఏఈ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఉషారాణి, ఆర్ఐ రాజేశ్, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా
లక్ష్యంపై...నిర్లక్ష్యం



అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించే గుడ్డంపల్లె వద్ద కాలువ పరిస్థితి

- నత్తనడకన పీబీసీ లైనింగ్ పనులు
- దృష్టి పెట్టని క్వాలిటీ కంట్రోల్ విభాగం
- మే నెలాఖరుకు నీరు పారించాలన్న లక్ష్యంపై నీలినీడలు
- నేడు నీటి పారుదలశాఖా మంత్రి రామానాయుడు రాక



గ్రావెల్ వర్క్ మాత్రమే పూర్తయిన హంద్రీ-నీవా కాలువ

బి.కొత్తకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పనులపై ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యంపై నిర్లక్ష్యం నీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వ లక్ష్యం ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు. కుప్పం వరకు నీటిని తరలించేందుకు ఏర్పడుతున్న అడ్డంకులను అధిగమించి మే నెలాఖరుకు కృష్ణాజలాలను తరలించాలని కూటమి ప్రభుత్వం భావించింది. ఇందుకోసం కాలువను వెడల్పు చేయడంతో పాటు ఇరువైపులా సిమెంటు లైనింగ్ వేసి చుక్కనీరు వృథా కాకుండా పుంగనూరుబ్రాంచి కెనాల్ ద్వారా కుప్పంకు నీటిని తరలించేందుకు టెండర్లు పిలిచింది. నీటిని తరలించడంతో పాటు తంబళ్లపల్లి, మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాలలో హంద్రీ-నీవాతో అనుసంధానించిన చెరువులను నింపి ఆయా ప్రాంతాల రైతాంగాన్ని ఆదుకోవాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అయితే వివిధ కారణాలతో ఆ లక్ష్యాన్ని చేరడం మరింత ఆలస్యం అవుతోంది. అసలు ఏం జరుగుతోంది ? ఎందుకిలా జరుగుతోంది అని పరిశీలించడం కోసం రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గ పర్యటనకు వస్తున్నారు.

రూ.480.22 కోట్లతో పీబీసీ లైనింగ్ పనులు

పీటీఎం మండలంలోని గుడ్డంపల్లి వద్ద అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించి బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లి, పుంగనూరు రూరల్, పెద్దపంజాణి మండలాల మీదుగా కుప్పం నియోజకవర్గానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు ప్రవహిస్తాయి. గతంలో ఈ కాలువకు గండ్లుపడటం, తెగ్గొట్టి నీటిని మళ్లించుకోవడం, పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, నీరు ఇంకిపోవడం లాంటి కారణాలతో ప్రవాహం గమ్యం చేరేది కాదు. వైసీపీ హయాంలో ఒకసారి కుప్పంకు నీరు పారించామని చెప్పుకున్నప్పటికీ అది నామమాత్రమైంది. కాలువ వెడల్పు కోసం అంటూ వైసీపీ హయాంలో నిధులు విడుదలైనా పనులు కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.480.22 కోట్లతో అడుగున 6 మీటర్లు, పైన 14.25 మీటర్ల వెడల్పుతో 133 కి.మీ మేర సిమెంట్ లైనింగ్ పనులను ప్రారంభించింది.

నత్తనడకన పనులు..పర్యవేక్షణ కరువు

పుంగనూరు బ్రాంచ్ కెనాల్ పనులు 35 శాతం, కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు 60 శాతం మాత్రమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. లైనింగ్ పనులు దక్కించుకున్న కంపెనీ అలసత్వం కారణంగా నిర్ణీత సమయంలో లక్ష్యాన్ని చేరుకోలేక పోతోంది. సాంకేతిక విభాగం, క్వాలిటీ కంట్రోల్ విభాగం సరిగా దృష్టి పెట్టకపోవడంతో పనులు ఆలస్యం కావడంతో పాటు నాణ్యతపై కూడా విమర్శలు వినబడుతున్నాయి. కాలువలో కాంక్రీటు పనులపై పర్యవేక్షణ లేదని, వేశాక అవసరమైన మేరకు క్యూరింగ్ చేయలేదని కాలువకు చుట్టుపక్కల ఉన్న రైతులు ఆరోపిస్తున్నారు.

ఆలస్యం అయ్యేకొద్దీ నీరు వృథా..

శ్రీశైలం నుంచి జీడిపల్లి రిజర్వాయర్ మీదుగా సత్యసాయి జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్‌కు తరలించి నిల్వ ఉంచి కృష్ణా జలాలు క్రమంగా ఆవిరైపోతున్నట్లు చెబుతున్నారు. 1.680 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న చెర్లోపల్లె రిజర్వాయర్‌లో డిసెంబరు నుంచి నీరు నిల్వ ఉంది. ఆ నీటిని పీబీసీ ద్వారా తరలించుకుని ఉంటే మరోసారి జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని మళ్లించడం సాధ్యమయ్యేది. కాలువ లైనింగ్ పనులు పూర్తయ్యే వరకు నీటిని అన్నమయ్య జిల్లా వైపుకు తరలించే అవకాశం లేదు. దీంతో ఇక్కడ ఆలస్యం అయ్యేకొద్దీ నీరు వృథా అవుతోంది.

నేడు మంత్రి పరిశీలన

హంద్రీ-నీవా లైనింగ్ పనులను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు నేడు పరిశీలించనున్నారు. కురబలకోట మండలం దొమ్మన్నబావి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం హంద్రీ-నీవా అధికారులు, ఎన్‌సీసీ కంపెనీ ప్రతినిధులతో సమీక్షించనున్నారు.


జూన్ 15 కల్లా పనులు పూర్తి చేస్తాం..

కాలువ పాతపడిపోవడం, కొండలు గుట్టలమయం కావడం కొన్ని ప్రాంతాలలో ఇసుక కొరత, నిర్మాణ సామాగ్రి చేరకపోవడం లాంటి కారణాలతో లైనింగ్ పనులు ఆలస్యం అయ్యాయి. వర్షం వల్ల కూడా పనులకు బ్రేక్ పడుతోంది. కాంట్రాక్టు కంపెనీ వేగంగా పనులు చేస్తోంది. పర్యవేక్షిస్తున్నాం. జూన్ 15 నాటికి పనులు పూర్తి చేసి కాలువద్వారా నీటిని తీసుకొస్తాం.

- విఠల్‌ప్రసాద్, ఎస్ఈ, హంద్రీ-నీవా

గాలివాన బీభత్సం

- నేలకొరిగిన చెట్లు ● రాత్రంతా అంధకారంలో వాల్మీకిపురం





వాల్మీకిపురం కోర్టు ఆవరణలో విద్యుత్ లైన్లపై పడిన చెట్టు, కూలిన రేకుల షెడ్డు

వాల్మీకిపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణంలో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి వరకు ఉరుములు, పిడుగుల శబ్దాలకు పట్టణ వాసులు భీతిల్లిపోయారు. సరిగ్గా 9 గంటల సమయాన మొదలైన వర్షం హోరు గాలి కారణంగా పలు ప్రాంతాలలో చెట్లు నేలకొరిగాయి. స్థానిక కోర్టు ఆవరణలో విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడ్డాయి. పలుచోట్ల గాలి బీభత్సానికి రేకుల షెడ్లు కూలిపోయాయి. పట్టణ సమీపంలోని పలు ప్రాంతాలలో గాలికి మామిడి తోటల్లో కాయలు నేలరాలి నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. 34.6 మీ.మీ వర్షపాతం నమోదైంది. భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులు, పిడుగుల కారణంగా పట్టణంలో విద్యుత్ లేకపోవడంతో ప్రజలు రాత్రంతా అంధకారంలో గడిపారు. గురువారం వేకువ జాము నుంచే ట్రాన్స్‌కో ఏఈ రాజశేఖర్ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ విద్యుత్ లైన్లను పునరుద్ధరించారు. పట్టణంలోని జాతీయ రహదారిపై విద్యుత్ లైన్లకు ఇబ్బందికరంగా మారిన చెట్లను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

పదోన్నతుల కోసం ఎదురుచూపు

- ఉపాధి హామీ ఉద్యోగుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..!

6

మారిన వైసీపీ స్వరం

- మా ప్రభుత్వంలో చేయలేకపోయాం.. మీ ప్రభుత్వంలోనైనా చేయండి
- జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు ● ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

ఈ పర్యాయం జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధుల స్వరం మారింది. మా ప్రభుత్వంలో పనులను పూర్తిచేయలేకపోయాం.. మీ ప్రభుత్వంలోనైనా పెండింగ్ పనులకు తగిన నిధులు కేటాయించి మోక్షం కల్పించాలని వినమ్రంగా సూచించారు. వైసీపీ, టీడీపీ కలిసి ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ కొనసాగించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, గిట్టుబాటు ధరలు, నీటి ఎద్దడి, విద్యుత్, రోడ్లు, విద్య, వైద్యం, పనుల పురోగతి తదితర ప్రధాన సమస్యలపై చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ రామగోవింద్‌రెడ్డి చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, తదితరులు

కడప రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం జడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితో పాటు టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, వైసీపీ ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ, జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ, జడ్పీటీసీలు, ఎంపీపీలు వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఉగ్రదాడిలో మరణించిన జవాన్ మురళీనాయక్, ఇటీవల మరణించిన మాజీ జడ్పీ చైర్మన్ సీఎం బలరామిరెడ్డిలకు నివాళులు అర్పించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చను కొనసాగించారు.

నకిలీ విత్తనాలపై ధ్వజం

అజెండాలోని మొదటి అంశంగా వ్యవసాయశాఖపై ఉదయం 10-50 నుంచి 12-13 నిమిషాల వరకు చర్చ సాగించారు. చక్రాయపేట మండలంలో తక్కువ వర్షపాతం నమోదైందని భూగర్భ జలాలు అడుగంటాయని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కరువు మండలంగా ప్రకటించాలని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని 71 మంది రైతులు పాడాలో పైపులకు డబ్బులు చెల్లించి రెండు సంవత్సరాలు అయినా ఇంతవరకు పైపులు ఇవ్వలేదన్నారు. అకాల వర్షాలకు మామిడి తోటలు దెబ్బతిన్నాయన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పావలా వడ్డీ కింద రైతులు తీసుకున్న క్రాప్ లోన్లను ఇంతవరకు ఏపీజీబీ అధికారులు జమచేయలేదని వాటిని వెంటనే రైతుల ఖాతాల్లో జమచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ కరువుతో అరకొరగా పండిన అరటి, కర్బూజ, దోస, నిమ్మ పంటలకు తగిన గిట్టుబాటు ధర లభించడం లేదన్నారు. వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ అరటి ఉత్పత్తులను మార్కెటింగ్ శాఖ అధికారులు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలన్నారు. చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేస్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం తగిన చొరవ చూపడం లేదన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ నకిలీ విత్తనాల విక్రేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ పిట్టు బాలయ్య యాదవ్ మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలంలోని బాలయ్యగారిపల్లె, నల్లయ్యగారిపల్లెలో నాసిరకం ఉల్లి విత్తనాల కారణంగా దాదాపు 30 హెక్టార్లలో పంటలను రైతులు నష్టపోయారన్నారు. బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ నాసిరకం విత్తనాల కారణంగా రబీలో దాదాపు 100 ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని

- మిగతా 6వ పేజీలో..

చిన్నారిపై లైంగిక దాడికి యత్నం

లైబ్రేరియన్ రామచంద్రనాయక్‌పై కేసు నమోదు

గాలివీడు, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న చిన్నారి (10)పై లైంగిక దాడికి ప్రయత్నించిన లైబ్రేరియన్ రామచంద్రనాయక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వేసవి సెలవుల్లో సమయం వృథా కాకుండా పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించుకుంటారన్న సదుద్దేశ్యంతో గ్రంథాలయ శిక్షణ శిబిరానికి తమ పిల్లలను పంపిస్తే లైబ్రేరియన్ రామచంద్రనాయక్ చిన్నారిపై లైంగిక దాడికి ప్రయత్నించిన ఘటన గాలివీడు మండల కేంద్రంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న రామచంద్రనాయక్ వేసవి శిక్షణ శిబిరాన్ని స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో నిర్వహిస్తున్నాడు. ఇదే క్రమంలో గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యార్థులు హాజరు కాగా అందులో మగ పిల్లలను మాత్రం మైదానంలో ఆడుకోవాలని పంపించాడు. ఒక విద్యార్థినిని చెత్త ఊడ్చమని చెప్పి ఆ చిన్నారిపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ చిన్నారి గట్టిగా అరుస్తూ బయటకు పరుగులు తీసి విషయాన్ని తన సోదరి, సోదరుడితో కలిసి నానమ్మకు తెలియచేసింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రైవేట్ బస్సు కండక్టర్‌పై
మాజీ ఎమ్మెల్యే దాడి

- తన బస్సు కంటే ముందు వచ్చిందని ఆగ్రహం
- నవాజ్‌బాషాతో నాకు ప్రాణహాని ఉంది
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు



పోలీసులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె అర్బన్/టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో నియంతలా వ్యవహరించిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా అధికారం పోయినా కూడా తన పంథాను మార్చుకోలేదు. తన ట్రావెల్స్ బస్సు కంటే ముందు మరో ట్రావెల్స్ బస్సు వచ్చిందన్న ఆగ్రహంతో వందలాది మంది చూస్తుండగా మదనపల్లెలోని బెంగళూరు బస్టాండులో హరినాథ్ అనే కండక్టర్‌పై తన అనుచరులతో దాడి చేయించాడు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో తనకు ప్రాణహాని ఉందని కండక్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. వైసీపీకి చెందిన మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు బెంగళూరు-మదనపల్లె మార్గంలో ప్రైవేట్ బస్సు తిరుగుతోంది. ఈ బస్సు సమయానికి ముందుగానే మధుసూదన ట్రావెల్స్‌కు చెందిన బస్సు టైమింగ్స్ పర్మిట్ ఉండటంతో ఆ బస్సు యథావిధిగా తిరుగుతోంది. కాగా వైసీపీ పాలనలో అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న నవాజ్‌బాషా పలుమార్లు మధుసూదన ట్రావెల్స్ బస్సును పోలీసులు, ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో తనిఖీలు చేయించి, తన బస్సు టైమింగ్‌కు అడ్డు రాకుండా కేసులు బనాయించి అనేక రకాలుగా ఇబ్బందులు పెట్టారు. మూడు రోజుల క్రితం మధుసూదన ట్రావెల్స్‌కు చెందిన కండక్టర్ శ్రీనాథ్‌పై నవాజ్‌బాషా తన అనుచరులతో దాడికి ప్రయత్నించగా పోలీసులు అక్కడికి చేరుకోవడంతో మిన్నకుండిపోయారు. ఈ విషయంగా పోలీసులకు, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విషయం చెప్పారనే ఆగ్రహంతో ఉన్న ఆయన ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం తన బస్సు కన్నా ముందు ఆ బస్సు వచ్చిందని బస్సు కండక్టర్, చీకలబైలు పంచాయతీ దొనకొండకు చెందిన హరినాథ్‌ను తీవ్రంగా దూషించడంతో పాటు వందలాది మంది చూస్తుండగా తన అనుచరులతో దాడి చేయించాడు. అనంతరం అక్కడి నుంచి రూంలోకి తీసుకెళ్లి మరోసారి దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ ఎర్రిసావలి, ఎస్ఐ శివకుమార్, టూటౌన్ సీఐ రామచంద్ర అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. గాయపడ్డ హరినాథ్ మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు హరినాథ్ ఫిర్యాదు మేరకు రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను టూటౌన్ పోలీసులు తమ అదుపులోకి తీసుకుని జడ్పీ హైస్కూల్ ముందు ఉంచారు. కాగా రెండు బస్సు టైమింగ్స్ వివరాలు కావాలని టూటౌన్ సీఐ రామచంద్ర మదనపల్లె ఆర్టీవోను కోరడంతో ఆయన ఆదేశాల మేరకు ఎంవీఐ దినేశ్‌చంద్ర, ఏఎంవీఐ శ్రీహరి రెండు బస్సులను రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో తనకు ప్రాణహాని ఉందని కండక్టర్ పోలీసులకు తెలిపారు. కాగా ఈ విషయమై మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషాపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కండక్టర్ హరినాథ్

మారిన వైసీపీ స్వరం

- మా ప్రభుత్వంలో చేయలేకపోయాం
- మీ ప్రభుత్వంలోనైనా చేయండి
- జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు
- ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

(5వ పేజీ తరువాయి)

ఈసారైనా ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్బీకేలలో ఎరువులు లేకపోవడంతో డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ పలానా డీలర్ అని చెప్పితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరికట్టకపోతే ఎలా అన్నారు.

మార్కెటింగ్‌శాఖ అధికారులపై చిటపటలు

మార్కెటింగ్‌శాఖ చర్చలో అధికారులపై ప్రజాప్రతినిధులు చిటపటలాడారు. పులివెందుల మార్కెటింగ్‌శాఖ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విరుచుకుపడ్డారు. వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధరలను నిర్ణయించడం వలన చీనీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ సిండికేట్ అయిన వ్యాపారులు ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉండేవారే కావడంతో వారి ఆటలు సాగుతున్నాయన్నారు. వేంపల్లెలో రూ.2.50 కోట్లతో మార్కెట్ యార్డును ప్రారంభించినప్పటికి నిరుపయోగంగా ఉందని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ కడప మార్కెట్ యార్డులో మౌలిక వసతులు లేక పంట ఉత్పత్తులు వర్షంలో తడిసిపోతున్నాయన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి

విద్యాశాఖ చర్చలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సూచించారు. క్వాలిఫైడ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నారని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు కింద మిగిలిపోయిన పనులను పూర్తిచేయాలన్నారు.

ఆర్‌అండ్‌బీ శాఖ చర్చలో

బి.మఠంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో అక్రమంగా షాపులు ఏర్పాటుచేసుకుని నడుపుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వీరనారాయణరెడ్డి కోరారు. చెన్నూరు ఎంపీపీ సురేశ్, పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య తదితరులు తమ మండలాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రైతులపై కేసులు పెట్టడం సరికాదు

పెద్దముడియం మండలంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం మంచిదేనని కానీ దీని పేరుతో రైతులకు అన్యాయం చేయడం తగదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. రైతుల అనుమతి లేకుండానే వారి పొలాల్లో సోలార్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. రైతులు అడ్డుపడితే వారిపై కేసులు పెడుతున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి సోలార్ ప్రాజెక్టు ఎంతో అవసరమన్నారు. సాగుకు పనికిరాని, నిరుపయోగంగా ఉండే భూములలో మాత్రమే ఏర్పాటు చేస్తున్నారన్నారు. మీరు చెప్పినది ఏదైనా ఉంటే విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

హార్టికల్చర్ హబ్‌గా కడప

రాయలసీమలోని కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చామని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో లక్ష ఎకరాలను హార్టికల్చర్ కింద సాగుచేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందులో దాదాపు 60వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద బహు వార్షిక పద్ధతిలో పండ్లతోటల పెంపకం, 40వేల ఎకరాల్లో వార్షిక పద్ధతిలో ఉద్యాన సహాయ అభివృద్ధి పథకం కింద పూలు, కూరగాయల సాగుకు సుముఖంగా ఉన్న రైతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 2.10 లక్షల మంది అర్హులైన రైతులను పరిశీలిస్తున్నామన్నారు. పులివెందుల నియోజకవర్గంలో పాడా రద్దయిన నేపథ్యంలో రైతులు పైపుల కోసం చెల్లించిన నగదుకు సంబంధించి ఏపీఎంఐపీ ద్వారా న్యాయం చేసే విధంగా కృషిచేస్తామన్నారు. ఈ ఖరీఫ్‌లో వ్యవసాయానికి సంబంధించి సీడ్ ఉత్పత్తి విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో బోర్లు వేసిన వెంటనే పవర్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జడ్పీ నిధుల కేటాయింపులో ఎమ్మెల్యేలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సభకు ప్రతిపాదన చేశారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని జడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డి తెలిపారు. జడ్పీ నిధులను సభ్యులందరికి సమానంగా ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి

రూ.13.53 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

- ఇప్పటికే 251 పనులు పూర్తి
- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ

పీలేరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ఊపందుకుంది. మొదటి విడతలో రూ.13.53 కోట్లతో 30.24 కిలోమీటర్లు సీసీ రోడ్ల నిర్మాణం కోసం 282 పనులు చేపట్టారు. ఇందులో వాల్మీకిపురంలో ప్రహరీ నిర్మాణం పోను మిగిలిన 281 పనులు సీసీ రోడ్లు కావడం గమనార్హం.



పీలేరు ఎన్టీఆర్‌నగర్‌లో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి (ఫైల్)- పీలేరులో నిర్మించిన సీసీ రోడ్డు

పీలేరులో రూ.3.81 కోట్లతో 79 పనులు, కేవీ పల్లెలో రూ.1.80 కోట్లతో 23 పనులు, కలకడలో రూ.1.75 కోట్లతో 38 పనులు, కలికిరిలో రూ.2.19 కోట్లతో 51 పనులు, గుర్రంకొండలో రూ.1.73 కోట్లతో 48 పనులు, వాల్మీకిపురంలో రూ.2.41 కోట్లతో 41 పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 251 పనులు పూర్తి చేసి 28.38 కిలోమీటర్లు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మరో 30 పనులు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. పీలేరు పట్టణ శివారు ప్రాంతం ఎన్టీఆర్ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఇటీవల ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించి ప్రారంభించడంతో పాటు అధికారులు, పనులు చేసిన వారిని అభినందించారు.

కొత్తగా రూ. 1.32 కోట్లతో 31 పనులు

మొదటి విడతలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావడంతో డిస్ట్రిక్ మినరల్ గ్రాంట్‌లో భాగంగా రూ.1.32 కోట్లతో కొత్తగా 31 పనులు మంజూరయ్యాయి. ఇందులో కలకడలో రూ.19 లక్షలతో 4 పనులు, కలికిరిలో రూ.85.60 లక్షలతో 19 పనులు, పీలేరులో రూ.13 లక్షలతో 3 పనులు, వాల్మీకిపురంలో రూ.15 లక్షలతో 3 పనులు మంజూరు చేశారు.

రూ.10 కోట్లతో కొత్తగా ప్రతిపాదనలు....

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పీలేరు నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కలెక్టర్, డ్వామా పీడీలకు ప్రతిపాదనలు పంపారు. సీసీ రోడ్లు సత్వరం నిర్మించాల్సిన వివరాలతో ప్రతిపాదనలు పంపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

నాణ్యతలో రాజీపడం...



పీలేరు నియోజకవర్గంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. ఎక్కడా క్వాలిటీలో రాజీ పడడం లేదు. పనుల నిర్వహణ, పర్యవేక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనులపై క్వాలిటీ కంట్రోల్ ప్రత్యేక నిఘా ఉంది. కాంట్రాక్టర్లు సైతం పనుల నాణ్యతలో అధికారులపై ఒత్తిడి తేవడం లేదు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. ఎక్కడైనా తేడా వస్తే ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- మధుసూదన, డీఈఈ, పంచాయతీరాజ్, పీలేరు.

మదనపల్లెలో అగ్ని ప్రమాదం

- రూ.2 లక్షల ఆస్తినష్టం

మదనపల్లె అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీలోని బాబునగర్ కాలనీలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప వివరాల మేరకు.. వన్నూర్‌సాహెబ్ గుట్ట సమీపంలో లక్ష్మీదేవి, శ్రీనివాసులు నివాసం ఉంటున్న ఇంటికి ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశామన్నారు. ఇందులో సుమారు రెండు లక్షలకు పైగా నష్టం జరిగిందని ఇంటి యాజమాని తెలిపారన్నారు. ప్రమాదంలో ఇంట్లోని బీరువా, బట్టలు, గ్యాస్ స్టవ్, వంట సామగ్రి, ఇంటిపత్రాలు కాలిపోయాయని పేర్కొన్నారు. ఇంట్లోని కరెంట్ మీటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మొదలై అగ్నిప్రమాదం జరిగిందన్నారు. తాలుకా సీఐ కళావెంకటరమణ, అగ్నిమాపక అధికారి శివప్ప, పోలీసులు పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఘనంగా ముగిసిన కొత్తపురమ్మ జాతర



కొత్తపురమ్మ ఆలయ జాతర ప్రాంగణంలో జనం

సంబేపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాలలో కొత్తపురమ్మ జాతర వైభవంగా ముగిసింది. ఏడాదికి ఒకరోజు వచ్చే జాతర ప్రజల్లో సందడిని, సంతోషాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా జాతరలకు వెళ్లడం ఆ రోజు ఆలయ ప్రాంగణాల్లో సంతోషంగా, సందడిగా గడపడం విశేషం. జాతరలో కనిపించే బంధువులు, స్నేహితులు ఒక్కొక్కరు బాగుండారా అంటూ పలకరింపులు, పిల్లలు బొమ్మలు కావాలని మారాం చేయడం, కావాల్సిన బొమ్మలు కొనడం ఎవరి సందడి వారిది. జాతరల్లో సోది చెప్పించుకోవడం ఇలా ప్రజల్లో ఎక్కడ లేని సంతోషం కనిపిస్తుంది. గురువారం దుద్యాల గ్రామ దేవత కొత్తపురమ్మ జాతర ఘనంగా ముగిసింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. భక్తులతో జాతర వాతావరణం కిక్కిరిసిపోయింది. కళ్లిపాటు కార్యక్రమంతో అమ్మవారి జాతర ఘనంగా ముసిగింది.



అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులతో బోనాలు

తంబళ్లపల్లెలో గాలివాన బీభత్సం



కన్నెమడుగులో గాలివానకు నేలకూలిన విద్యుత్ స్తంభం - సిద్దవటంలో గాలివానకు పడిపోయిన విద్యుత్ స్తంభం

తంబళ్లపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. మండల వ్యాప్తంగా 27.2 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గాలివానకు పలుచోట్ల కోతకు వచ్చిన మామిడికాయలు రాలిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నెమడుగులో విద్యుత్ స్తంభం నేలకూలింది. గాలికి పలుచోట్ల కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

నేలకొరిగిన స్తంభాలు,

సిద్దవటం, మే 15 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రత్నసభాపతినగర్‌లో గురువారం పెనుగాలుల బీభత్సానికి విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. గాలులు బీభత్సంతో విద్యుత్ స్తంభాలు 2, పెద్ద వృక్షం పడిపోయాయి. విద్యుత్ ఏఈ జయచంద్ర విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టారు.

కిసాన్ మేళా నిర్వహణకు సర్వం సిద్ధం

రైల్వేకోడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కిసాన్ మేళా కార్యక్రమం శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆవరణంలో నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మామిడి తదితర పంటల ప్రదర్శన కోసం 12 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రైతులు, అధికారులు, సిబ్బందికి భోజన సదుపాయాల ఏర్పాటుకు సిద్ధం చేశారు. సమావేశంలో మాట్లాడానికి ప్రతినిధులకు సమావేశ మందిరం ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి సుమారు 500 మంది రైతులు వస్తున్నారు. అదేకాకుండా ఉద్యాన విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రదర్శనల ఏర్పాట్లు చేశారు. కిసాన్‌మేళా కార్యక్రమం విజయవంతం చేయాలని ఉద్యాన పరిశోధన స్థానం వారు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌లో పదేపదే ఫిర్యాదులు

- బాధితుడిని విచారించిన సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బీకేపల్లె రెవెన్యూ గ్రామానికి సంబంధించి భూ వివాదంపై ఓ వ్యక్తి పీజీఆర్ఎస్‌లో పదేపదే ఫిర్యాదులు చేస్తుండడంతో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బాధితుడిని పిలిపించి విచారించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కోర్టు హాల్లో విచారణ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు నాగరాజు మీడియాతో మాట్లాడుతూ తనకు, తన కుమార్తెలకు బీకేపల్లె సర్వే నెంబర్లు 424, 425, 433లో మొత్తం 8.83 ఎకరాలు పిత్రార్జితంగా వచ్చిన భూమికి 2017 సంవత్సరం వరకు 1బి, అడంగల్ వుండేవన్నారు. తరువాత వచ్చిన రెవెన్యూ అధికారులు ఈ భూమిని నోషనల్ ఖాతాలో ఎక్కించారని, అప్పటి నుంచి తమ భూమికి పాసుపుస్తకం మంజూరు చేయాలని ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా, సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ తనను విచారించారని సంబంధిత భూమి చుట్టూ కంచె వేసుకుని తమ ఆధీనంలో వుంచుకుంటే, రెవెన్యూ అధికారులు వచ్చి సబ్ డివిజన్ చేసి పాసుపుస్తకాలు ఇస్తామని చెబుతున్నారని బాధితుడు తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంగంవారిపల్లికి చెందిన ఓ మహిళతో బి.కొత్తకోటకు చెందిన అభిలాష్‌రెడ్డి (28) ఫేస్‌బుక్ ద్వారా పరిచయాన్ని పెంచుకున్నారు. వీరి పరిచయం దాదాపు నాలుగేళ్లుగా కొనసాగింది. కాగా కొన్ని రోజులుగా అభిలాష్‌రెడ్డి తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని ఆ మహిళను వేధింపులకు గురిచేసేవాడు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే ఫేస్‌బుక్‌లో తమ సంభాషణను బయటపెడతానని బెదిరించాడు. దీంతో ఆ మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అభిలాష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

పదోన్నతుల కోసం ఎదురుచూపు...!



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఉపాధి హామీ ఉద్యోగుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..!

మదనపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరిని ఏమాత్రం పట్టించుకోకపోగా పదోన్నతులతో పాటు పీఆర్సీని కూడా పక్కనపెట్టిందని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం పీఆర్సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మాతృశాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులకు టైం స్కేల్ అమలుకు శ్రీకారం చుట్టి చరిత్ర సృష్టించింది. 2014-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు, ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల (ఏపీవో) లుగాను, హెచ్‌ఆర్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యార్హతలు కలిగి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్, ఈవోఆర్‌డీ కేడర్లలో (జీవో ఆర్.టి.నంబర్ 312, 2006) నియమితులైన ఏపీవోలు, అలాగే ఈసీలు, కోర్స్ డైరెక్టర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు, ప్లాంటేషన్ మేనేజర్లు, సహాయ పథక సంచాలకులు(ఏపీడీ)గా పదోన్నతి పొందారు. ఏపీడీలు అడిషనల్ పీడీలుగా పదోన్నతి పొందారు.

ఉపాధిహామీ పథకం అమలులో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడం, అమలుపరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనాపరమైన అంశాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్ని క్యాడర్లలోనూ పదోన్నతులకు అర్హులేనని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, బి.టి, సిమెంట్ రోడ్లు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి, రైతుసేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల ప్రహరీగోడల నిర్మాణం, తదితర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ ఉద్యోగుల భాగస్వామ్యం అధికంగా ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య, వైద్య, రైల్వే, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ మొదలైన ఇతర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ ద్వారానే జరుగుతున్నాయి. ఇందులో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఎస్ఆర్‌డీఎస్ కింద పనిచేస్తున్న ఎఫ్‌టీఈల నియామకం తేదీ, తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు.



పారా... హుషార్

- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- జిల్లాలో పెరుగుతున్న దొంగతనాలు
- కొరవడిన పోలీసుల నిఘా
- భయాందోళనలో ప్రజలు
- చోరీ సొత్తు రికవరీ అంతంతమాత్రమే





మీరు ఇళ్లకు తాళాలు వేసి ఎక్కడికైనా వెళుతున్నారా.. తస్మాత్ జాగ్రత్త... దొంగలు పొంచి ఉన్నారు... మీ ఇంటిపై పక్కాగా నిఘా పెడతారు.. మీరు ఊరు విడిచి వెళ్లడం లేదు కదా.. అని ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా... కాలక్షేపం కోసం బయటకు వెళ్లినా.. బంధువుల ఇళ్లకు వెళ్లి నిర్లక్ష్యంగా ఉన్నా.. క్షణాల్లో మీ ఇంటిపై వాలిపోతారు. అధునాతనమైన ఆయుధాలతో ఇంటి తలుపులను బద్దలు కొట్టి.. ఇంటిలోని సొమ్ములను, నగదును కొల్లగొడతారు..

కడప క్రైం, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండాపోతోంది. తినీ తినక కష్టించి కూడబెట్టుకున్న సొమ్ము దొంగలపాలు కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగలు తాళాలు వేసిన ఇంటిని టార్గెట్ చేస్తూ గంటల వ్యవధిలోనే చోరీలకు పాలపడుతున్నారు. అత్యాధునిక పరికరాలతో పక్కింటి వారికి కూడా అనుమానం రాకుండా దొంగలు తమ చేతివాటాన్ని చూపిస్తున్నారు. అసలే వేసవి కాలం కావడంతో చాలా మంది ఆరుబయట, ఇంటి మిద్దెలపె నిద్రిస్తుంటారు. ఇదే అదనుగా భావించి ఇళ్లలో చొరబడి చోరీలకు పాల్పడుతున్నారు. జిల్లాలో రోజూ ఏదోక ప్రాంతంలో దొంగతనాలు జరుగుతున్నా పోలీసుల నిఘా కొరవడింది. ఇక చోరీ సొత్తు రికవరీ కూడా అంతంతమాత్రమే అవుతోంది.

పోలీసు నిఘా అంతంత మాత్రమే...

జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్నప్పటికీ పోలీసు నిఘా అంతంత మాత్రమే ఉంది. ప్రతి పోలీసుస్టేషన్‌లో కొంతమంది ఐడీ పార్టీ పోలీసులు తిరుగుతుంటారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి ఒక వేళ దొంగ దొరికితే వారితో రికవరీ చేయించి బాధితులకు అప్పగించాల్సి ఉంటుంది. అయితే ఐడీ పార్టీ పోలీసులు ప్రతి స్టేషన్‌లో ఉన్నప్పటికీ దొంగలను పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఇక సీసీఎస్ పోలీసుల నిఘా ఎక్కడా కనిపించడం లేదు. ఎక్కడ దొంగతనాలు జరిగినా సంబంధిత పోలీసులు దొంగలను గుర్తించడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

జిల్లాలో సిబ్బంది కొరత వేధిస్తోంది. నేరస్తులపై నిఘా ఉంచాలన్నా, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలన్నా సిబ్బంది పూర్తిస్థాయిలో ఉండాలి. అయితే ఏళ్ల తరబడి సిబ్బంది కొరత ఉండడంతో ఉన్న సిబ్బందితోనే విధులను నెట్టుకొస్తున్నారు. దీంతో దొంగతనాలపై నిఘా ఉంచలేకపోతున్నారు. ఇక జిల్లాలో మొత్తం ఏడు ఎల్‌హెచ్ఎంఎస్ కెమెరాలే పనిచేస్తున్నట్లు తెలుస్తుంది. కడప నగరంలో రోడ్ విస్తరణలో భాగంగా సీసీ కెమెరాలు కనెక్షన్లు తొలగించడం, దీంతో నగరంలో 14 చోట్ల మినహాయిస్తే ఎక్కడా కూడా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

ఇతర రాష్ట్రాల వారే దొంగలు

గతంలో పోలీసులు ఒక దొంగతనానికి వెళితే ఆ దొంగతనం ఎవరు చేశారన్నది వేలిముద్రలు పట్టి గుర్తిస్తుండేవారు. అయితే ప్రస్తుతం టెక్నాలజీ మారడం, ఎంతటి తలుపు అయినా బద్దలు కొట్టే పరికరాలు రావడంతో దొంగతనాలు సులువుగా చేసేస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ పాగా వేసి వారు ఇళ్లలోకి చొరబడి దొరికిన కాడికి దోచుకుని తమ రాష్ట్రానికి పారిపోతున్నారు. దీంతో పోలీసులు వారిని గుర్తించలేకపోతున్నారు.

జిల్లాలో ఇటీవల జరిగిన దొంగతనాలు ఇలా...

- ఈ ఏడాది మార్చి 9న ప్రొద్దుటూరులోని ఓ ఇంటిలో చోరీకి పాల్పడి దాదాపు 80 తులాల బంగారు నగలతో పాటు రూ.7 లక్షల నగదును దోచుకెళ్లారు.
- మార్చి 19న వేంపల్లెలో పట్టపగలే ఓ ఇంటిలో దోపిడీ చేశారు. రూ.10 లక్షలు విలువ చేసే బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు.
- ఏప్రిల్ 17న ప్రొద్దుటూరులో ఒకే రోజు నాలుగు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. మొత్తం 60 తులాల మేర బంగారు నగలు, 3 కేజీలు వెండి, రూ.12 లక్షల నగదును అపహరించారు.
- ఇటీవల కడప నగరంలోని ఓంశాంతినగర్‌లో ఓ న్యాయవాది ఇంట్లో దొంగలు పడి భారీగా బంగారం, నగదును దోచుకెళ్లారు. అలాగే ఫక్కీరుపల్లెలో నివాసం ఉంటున్న ఓహోంగార్డు ఇంట్లో కూడా భారీ ఎత్తున బంగారం, నగదు దొంగలు ఎత్తుకెళ్లారు.

తాళాలు వేసిన ఇంటినే టార్గెట్ చేసుకుని పగలు రాత్రి తేడా లేకుండా ఈ దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదిఏమైనా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి దొంగతనాలను అరికట్టి, చోరీలో పోయిన సొత్తులను రికవరీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మూడు కోర్టులకు శాశ్వత అడ్వాన్సు నిధులు మంజూరు


కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని మూడు న్యాయస్థానాలకు నిర్వహణ వ్యయం కోసం శాశ్వత అడ్వాన్సు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. కడపలోని పోక్సో ప్రత్యేక కోర్టుకు రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ.3000, బద్వేలులోని సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్)కు రూ.2000, కడపలోని ఏడవ అదనపు జిల్లా కోర్టు (మహిళలపై జరిగే నేరాల విచారణకు ప్రత్యేక కోర్టు)కు రూ.3000 వంతున శాశ్వత అడ్వాన్సు నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు.

గరుడ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం 5వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో శ్రీవారికి మోహిని ఉత్సవం చేశారు. అనంతరం స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి అలంకరణ మండపంలో గరుడవాహనంపై అలంకరించి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పండితులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



దొరబాబు మృతదేహం

మైలవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి గురువారం ఓ యువకుడు మృతి చెందాడు. పోలీ సుల వివరాల మేరకు.. పెద్దకొమెర్ల గ్రామానికి చెందిన తెల్లదొరబాబు (23) అనే యువకుడు గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్ లోడు తీసుకుని రాత్రి 11.30 గంటలకు కోవెలకుంట్లకు బయ లుదేరాడు. గ్రామ సచివాలయ సమీపంలోని చిన్నకొమెర్లకు వచ్చే రహదారిలో ట్రాక్టర్ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతోపక్కనే ఉన్న గుంతలో పడి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో టైరుకింద పడిన దొరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దొరబాబు తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెంగళూరులో రైలుకింద పడి యువకుడి..



శివానందరెడ్డి (ఫైల్)

కలసపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన బిజివేముల శివానందరెడ్డి (25) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగళూరులో రైలుకింద పడి మృతి చెందాడు. నందిపల్లె గ్రామానికి చెందిన పుల్లారెడ్డి కుమారుడు శివానందరెడ్డికి 9 నెలల క్రితం పోరుమామిళ్ల మండలానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఇతను కేఆర్‌పురం సమీపంలోని రైలు పట్టాలపై గురువారం శవమై కనిపించినట్లు బంధువులు తెలిపారు. శివానందరెడ్డి మృతితో మహానందిపల్లెలో విషా దచ్ఛాయలు అలుముకున్నాయి.

తెలుగుగంగ కాల్వలో గుర్తుతెలియని శవం

కలసపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని ఆర్‌సీఎం చర్చి వెనక భాగంలో ఉన్న తెలుగుగంగ కాల్వలో గురువారం ఓ గుర్తుతెలియని శవం లభ్యమైంది. మృతుడి వయసు 60 సంవత్సరాలకు పైబడి ఉంటుందని, కాషాయవస్త్రాలు ధరించి ఉన్నారు. గుర్తు పట్టలేని విధంగా కుళ్లి ఉన్న శవాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్ఐ తిమోతి పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



పట్టుబడిన వ్యక్తులతో సీఐ శివశంకర్, ఎస్ఐ వినోద్‌కుమార్

దువ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామంలో ఈనెల 12వ తేదీ స్థలం విషయమై జరిగిన ఘర్షణలో కందుకూరి నారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసు విషయంలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మైదుకూరులోని ఓ హోటల్ వద్ద గురువారం తెల్లవారుజామున నిందితులను అరెస్టు చేసి.. కోర్టుకు హాజరుపరు స్తున్నట్లు సీఐతోపాటు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

రాళ్లదాడి హత్యపై డీఎస్పీ విచారణ

చక్రాయపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి కోమటిపేటకు చెందిన కందుల చంటి అనే యువకుడి హత్య కేసుకు సంబంధించి గురువారం డీఎస్పీ మురళీనాయక్ విచారణ చేపట్టారు. చంటిని ముగ్గురు వ్యక్తులు రాళ్లతో దాడి చేసి హత్య చేయడంతో వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం హత్య జరిగిన సంఘటన స్థలానికి సీఐ ఉలసయ్య, ఎస్ఐ చంద్రశేఖర్‌లు వెళ్లి పరిశీలించారు.

ఘర్షణ కేసులో నలుగురు అరెస్టు

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూర్వపు బొమ్మేపల్లెలో ఈనెల 10వ తేదీ సాయంత్రం ఇంటి ముందు పేడనీళ్లు చల్లే విషయంలో ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో 13 మంది గాయపడగా... ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజచౌడప్ప (30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గురువారం బొగ్గు మల్లికార్జున, శివకృష్ణ, మునేశ్వరుడు, నాగేంద్ర అనే నలుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఎస్ఐలు హైమావతి, రామకృష్ణ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

కడప పశు సంవర్ధక శాఖ డీడీ అచ్చన్న హత్య కేసులో ప్రత్యేక కౌన్సిల్ నియామకం

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చిన్న అచ్చన్న 2023లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున వాదించడానికి ప్రత్యేక కౌన్సిల్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) నివేదిక మేరకు ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. క్రైమ్ నంబరు 113/2023లో కడప 1వ పోలీసు స్టేషన్‌లో ఈ హత్య కేసు నమోదయ్యింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు కూడా జతచేశారు. ఈ కేసు కడప నాలుగవ అదనపు జిల్లా జడ్జి (ఎస్సీ ఎస్టీ కోర్టు) విచారణలో వుంది. ప్రభుత్వం తరఫున ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించడానికి స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుడు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ మూర్తిని ప్రత్యేక కౌన్సిల్‌గా నియమించింది. ఈ మేరకు డీజీపీ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

చెట్టును ఢీకొన్న లారీ

- అంతకు ముందు ద్విచక్ర వాహనం, బస్సును సైతం ఢీ
- ఐదుగురికి గాయాలు
- మద్యం మత్తే కారణం



వల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో లారీని నడిపిన డ్రైవరు ఒక ద్విచక్ర వాహనాన్ని, ఆ వెంటనే ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కిరాణా బంకును, దాని పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఐదుగురికి గాయాలు కాగా.. కిరాణా బంకుతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, బస్సు దెబ్బతిన్నాయి. వివరాలిలా.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిరుమలపురానికి చెందిన లారీడ్రైవరు షేక్ అబ్దుల్లా అహ్మద్ గురువారం కడప నుంచి లారీలో గుజరీ సామాన్లను లోడు చేసుకుని తాడిపత్రి వైపునకు వెళుతున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఇతను మండల పరిధిలోని పాపాఘ్నినగర్ (కట్ట) బస్టాపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఆ వెంటనే ఓ ప్రైవేటు బస్సును, అనంతరం రోడ్డు పక్కన చిల్లర దుకాణం బంకును, దాని పక్కనే పార్కు చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను తొక్కించాడు. చివరకు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో క్యాబిన్‌లోనే డ్రైవర్ ఇరుక్కుపోయాడు. స్థానికులు అతన్ని బయటికి తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ పెద్ద ఓబన్న సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని ఎక్స్‌కవటేర్ సాయంతో సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు డ్రైవరును బయటికి తీశారు. చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఏ తెలుగు, హిస్టరీ, పీఏస్ అండ్ పీఏ, ఎకనామిక్స్, ఉర్దూ ఎంకామ్ కోర్సులలో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సొంతం చేసుకున్నారని తెలి పారు. అఫిలియేటెడ్ కాలేజీల్లో ఎంకామ్‌లో 96.30 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఎమ్మెస్సీ బోటనీ, బయోకెమిస్ట్రీ, జియాలజీ, మేథమేటిక్స్ మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్ మెంటల్ సైన్స్, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ ఫుడ్ టెక్నాలజీ, ఎంపీఈడీ కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఫిజిక్స్ 90శాతం, జువాలజీ 96.97 శాతం, బయోటెక్నాలజీ 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పాల్గొన్నారు.

గోపవరం మండలంలో జేసీ పర్యటన

గోపవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంఐజీ లేఅవుట్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సందర్శించి పరిశీలించారు. ఎంఐజీ లేఅవుట్‌లో భూములు కోల్పోయిన వారికి అసైన్‌మెంటు ద్వారా కేటాయించిన భూములను పరిశీలించారు. ప్రాజెక్టు కాలనీ-2లో రేషన్‌షాపును తనిఖీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధి కారి చంద్రమోహన్, కుడా సెక్రటరీ శిరీషా, త్రిభువన్‌రెడ్డి గోపవరం తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

మహిళ కడుపు నుంచి 8 కేజీల కణితి తొలగింపు



మహిళ కడుపులో నుంచి తొలగించిన కణితిని చూపుతున్న రిమ్స్ వైద్యులు

కడప సెవెన్ రోడ్స్, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (రిమ్స్)లో ఓ మహిళ కడుపు నుంచి 8 కేజీల కణితిని తొలగంచినట్లు గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మీ సుశీల తెలిపారు. ఆమె మాట్లాడుతూ 46 ఏళ్ల దర్బార్‌బబి అనే మహిళ కడుపునొప్పి, ఉబ్బరంతో శనివారం ఆసుపత్రిలో చేరారన్నారు. పరీక్షల అనంతరం వైద్యులు సర్వైకల్ ఫైబ్రాయిడ్‌గా నిర్ధారణ చేశారని, మంగళవారం క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ అమానుల్లా నేతృత్వంలో వైద్య బృందం మూడు గంటల పాటు శ్రమించి 8కేజీల గర్భాశయ ముఖద్వారం ద్వారా కణితిని తొలగించారన్నారు. రోగి కోలుకున్నారని, రెండు మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో డాక్టర్ అమానుల్లాతో పాటు గైనకాలజీ వైద్యులు డాక్టర్ లక్ష్మీ సుశీల, డాక్టర్ రబ్బాని బేగం, డాక్టర్ మాధవి, అనస్థీషియా విభాగం వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ వర సుబ్రమణ్యం, యూరాలజీ విభాగం వైద్యులు డాక్టర్ శ్రీదీప్ పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

- పెళ్లైన నాలుగు నెలలకే ఆత్మహత్యకు దారితీసిన వైనం



అర్షియాబేగం మృతదేహం

పులివెందుల, మే 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని నగరిగుట్టకు చెందిన అర్షియా బేగం (18) భర్త ఫయాజ్ ఫకృద్దీన్ చిత్రహింసలు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... పట్టణంలోని నగరిగుట్టకు చెందిన అర్షియాబేగం అదే ఏరియాకు చెందిన ఫయాజ్ ఫకృద్దీన్ ఇరువురు ప్రేమించుకొని ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. ప్రేమించిన వాడితో జీవితం సంతోషంగా ఉంటుందని అర్షియాబేగం భావించింది. వివాహం చేసుకున్న మరుసటి రోజు నుంచే భర్త వేధింపులు మొదలయ్యాయి. అర్షియాబేగం తల్లి జైబున్నీషా దుబాయ్‌లో ఉంటోంది. తండ్రి కరీముల్లా తిరుమలలో ఓ షాపులో పని చేస్తుంటారు. అర్షియాబేగం తన అమ్మమ్మ అయిన బున్ని దగ్గర ఉండేది. పెళ్లిచేసుకున్న నాటి నుంచి అర్షియాబేగంను భర్త చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. అర్షియాబేగం అమ్మమ్మ బున్నీని డబ్బుల కోసం ఇబ్బందులు పెట్టేవాడు. ఇటీవల కొంతమొత్తాన్ని తీసుకొని బైకు కూడా కొనుగోలు చేశాడు. ఫయాజ్ ఫకృద్దీన్ ఓ చికెన్ షాపులో పని చేస్తుంటాడు. బుధవారం రాత్రి డబ్బు కోసం అర్షియాబేగంతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన అర్షియాబేగం ఉరివేసుకొని చనిపోతానని భర్తకు చెప్పింది. కానీ భర్త ఆమె మాటలను పట్టించుకోకపోవడంతో బుధవారం అర్ధరాత్రి వంట రూములోకి వెళ్లి అర్షియా బేగం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

పిడుగుపడి వ్యక్తి మృతి



పులివెందుల, మే 15 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం కోరవానిపల్లెకు చెందిన గొర్ల కాపరి బొబ్బూరి చంద్రశేఖర్ (26) పిడుగుపడి మృతి చెందాడు. వివరాలిలా.. బొబ్బూరి చంద్రశేఖర్ ఆళ్లగడ్డ మండలం చిన్న బోదనం తిప్పనపల్లె గ్రామాల మధ్య తన గొర్ల దొడ్డిలో కాపలాకోసం నిద్రించాడు. బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా పిడుగుపడి మరణించాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గ్రామ పంచాయతీకి ఎక్కువ..మున్సిపాలిటీకి తక్కువ

- కుప్పలు కుప్పలుగా చెత్త
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- రాయచోటి మున్సిపాలిటీలో తిష్ట వేసిన సమస్యలు





కొత్తపేటలో చెత్తాచెదారంతో నిండి ఉన్న డ్రైనేజీ... బోస్‌నగర్‌లో సైదియా థియేటర్ పక్కన ఉన్న చెత్త కుప్ప... మండీల వద్ద పేరుకుపోయి మురుగు

రాయచోటిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీలో సమస్యలు తీష్ట వేశాయి. మున్సిపాలిటీలోని 34 వార్డుల్లో ఎక్కడ చూసినా సందు గొందుల్లో చెత్త దిబ్బలు పేరుకుపోయాయి. మున్సిపల్ కార్మికులు ప్రధాన రోడ్లకే పరిమితం అవుతుండడంతో డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి రోడ్లపై పారుతున్నాయి. ఇలా రాయచోటి మున్సిపాలిటీ గ్రామ పంచాయతీకి ఎక్కువ. మున్సిపాలిటీ తక్కువ అనే విధంగా తయారైంది. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన జాతీయ రహదారి విస్తరణ పనులు వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా పూర్తి కాకపోవడంతో నేటికీ అలాగే అసంపూర్తిగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న తరుణంలో రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేస్తారనే ఆశతో పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాయచోటి మున్సిపాలిటీలో రూ.300 కోట్లతో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులు కేవలం ఊరి బయట జరిగాయి. చాలా వార్డులో సిమెంటు రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షా కాలంలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమై డ్రైనేజలన్నీ నిండిపోయి రోడ్లపైన మురుగునీరు పారుతుంది. బిరాన్‌సాహెబ్‌వీధి, కొత్తపల్లి మేదరవీధి, మహబూబ్‌నగర్, లక్ష్మీథియేటర్ వెనుక భాగం, పాతరాయచోటి, మాండవ్యనది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు మురుగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో నెలలు తరబడి చెత్త తొలగించిన పరిస్థితులు గానీ, డ్రైనేజీ శుభ్రం చేసిన దైనం గానీ కనిపించడం లేదు.

అసంపూర్తిగా పనులు

రాయచోటి మున్సిపాలిటీలో 2018 టీడీపీ హయాంలో ప్రారంభమైన జాతీయ రహదారి విస్తరణ పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. రానా వద్ద డ్రైనేజీ నిర్మాణంతో పాటు సిమెంటు రోడ్డు నిర్మాణం కూడా పూర్తి కాలేదు. అలాగే మాసాపేటలో కొంత భాగం రోడ్డు పనులు పూర్తి కాలేదు. ప్రధాన సర్కిళ్లలో వాహనాలు యూటర్న్ తీసుకునేందుకు ఆక్రమణలు తొలగించినప్పటికీ పనులు పూర్తి చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. అంతేగాక జాతీయ రహదారిలోని సర్కిళ్లలో గత వైసీపీ ప్రభుత్వం అక్కడక్కడా విగ్రహాలు ఏర్పాటు చేసి వాటిని పూర్తి చేసి ప్రారంభించకుండా అలాగే వదిలేశారు. అంతేగాక రూ.300 కోట్లతో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులు కూడా ఆగిపోయాయి. పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారి విస్తరణ పనులను పూర్తి చేసి జిల్లా కేంద్రానికి నూతన శోభను తీసుకురావాలని పట్టణ ప్రజలు, జిల్లా ఉన్నతాధికారులతో పాటు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

వాహనాలు లేక.. చెత్త తొలగక...

గతంలో క్లాప్స్ కింద ఉన్న ఆటోలన్నీ సకాలంలో డబ్బు చెల్లించలేదన్న కారణంగా కంపెనీ వారు తీసుకెళ్లడంతో అప్పటి నుంచి మున్సిపాలిటీలోని అన్ని వార్డులో చెత్త తొలగడం లేదనే ఆరోపణలున్నాయి. గతంలో రాయచోటి మున్సిపాలిటీలో 34 వార్డులకు గానూ 25 ఆటోల ద్వారా చెత్తను సేకరించేవారు. ఆ వాహనాలు లేకపోవడంతో ఇప్పుడు వారానికి ఒకరోజు కూడా కొన్ని వీధుల్లో చెత్తను సేకరించడం లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు. ప్రస్తుతం మున్సిపాలటీలో ఉన్న ట్రాక్టర్లు, ఆటోలతో పాటు మరో 8 ట్రాక్టర్లను అద్దెకు తీసుకున్నప్పటికీ వారు మున్సిపాలిటీలోని అన్ని వీధులకు పూర్తి స్థాయిలో వెళ్లడం లేదనే ఆరోపణలున్నాయి. చెత్తా చెదారాన్ని రోజుల తరబడి ఇంట్లో పెట్టుకోలేక ప్రజలు బయట సందుగొందుల్లో పడేస్తుండడంతో పర్యావరణ కాలుష్యానికి రాయచోటి మున్సిపాలిటీ దారి తీస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ పాలకవర్గంతో పాటు అధికార యంత్రాంగం రాయచోటి పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధచూపాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పుల్లంపేట ఎస్ఐగా శివకుమార్



బాధ్యతలు చేపట్టిన శివకుమార్

పుల్లంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి):పుల్లంపేట ఎస్ఐగా బీవీ శివకుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గుర్రంకొండలో పనిచేస్తూ బదిలీపై పుల్లంపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న మోహన్‌కుమార్‌గౌడ్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి బదిలీ

రాజంపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణ ఎస్ఐగా పనిచేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి రైల్వేకోడూరు ఎస్:గా బదిలీపై వెళ్లారు. రాజంపేట పట్టణం-1 ఎస్ఐగా అన్నమయ్య వీఆర్‌లో ఉన్న పి.వెంకటేశ్, పట్టణం-2 ఎస్ఐగా రాందాస్ రాజంపేటకు బదిలీ అయ్యారు. వీరిరువురు రెండు రోజుల్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐలుగా విధులు చేపట్టనున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : నందలూరు నూతన ఎస్ఐగా మల్లికార్జునరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈయన కడప వీఆర్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే తనను నేరుగా సంప్రదించవచ్చునని తెలిపారు.

గణితంపై పిల్లలకు పట్టు ఉండాలి



పిల్లలకు గణితంపై అవగాహన కల్పిస్తున్న మురళి

రైల్వేకోడూరు, మే 15(ఆంధ్రజ్యోతి): గణితంపై పిల్లలకు పట్టు ఉండాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మురళి తెలిపారు. గురువారం రైల్వేకోడూరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే గణితంపై పిల్లలకు శ్రద్ధ కనబరిచేటట్లు తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కోదండరాముని దర్శించుకున్న కొత్తపల్లె గీత



ఒంటిమిట్ట కోదండరామాలయంలో కొత్తపల్లె గీత

ఒంటిమిట్ట, మే 15 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయాన్ని గురువారం ఉదయం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, అరకు మాజీ ఎంపీ కొత్తపల్లె గీత దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రావణ్‌కుమార్ వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. కోదండరాముని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె గీత భర్త రామకోటేశ్వరరావు, బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్, మండల బీజేపీ అధ్యక్షులు బానుప్రకాష్‌రాజు, నాయకులు కత్తి జగదీష్, కత్తి వెంకటరత్నం, వెంకటసుబ్బారెడ్డి, అన్వేష్‌కుమార్‌రెడ్డి, శివసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓబిలి గంగమ్మ సేవలో ఎమ్మెల్యే శ్రీధర్



ఎమ్మెల్యేకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పెనగలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓబిలి దళితవాడలో నిర్వహించిన గంగమ్మ జాతరకు గురువారం రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరై అమ్మవారి సేవలో తరలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేకు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకుడు మోడపూరి శ్రీనివాసులు, గట్టువారిపల్లె రాజశేఖర్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ యువ నాయకుడు ఎస్.అమీరుల్లా పాల్గొన్నారు. కాగా ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీలో చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో గురువారం పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సీఎం సహాయనిధి పంపిణీ చేశారు. భాకరాపేటకు చెందిన వై.రమేష్‌బాబుకు రూ.24 వేల చెక్కును అందజేశారు. ఈ చమర్తి మాట్లాడుతూ పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

గోవిందంపల్లెను సందర్శించిన అధికారులు

ఓబులవారిపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాలుష్య నియంత్రణ మండల అధికారులు మండల పరిధిలోని గోవిందంపల్లె గ్రామ పంచాయతీ కొత్తపల్లెను గురువారం సందర్శించారు. ముగ్గురాళ్ల పరిశ్రమల ద్వారా వెలువడే దుమ్ముధూళి, కాలుష్యం ద్వారా అనారోగ్యాలబారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల జబ్బులతో ఇబ్బందిపడుతన్నామన్నారు. నివారణకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరినట్లు మాజీ ఎంపీటీసీ ఈశ్వర్‌రాజు తెలిపారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న గ్రామస్థులు

చిన్నమండెం, మే15(ఆంధ్రజ్యోతి): సీతారాము కల్యాణ మహోత్సవాన్ని వండాడి గ్రామ పంచాయతీలోని కదిరివాండ్లపల్లె గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రంగారెడ్డి, సర్పంచ్ మునలిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కలశపూజ, గణపతిపూజ, నవగ్రహారాధన, స్వామి వారికి పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలతో అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అలాగే రాత్రికి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డీజే డ్యాన్సులు, కోలాటం వివిధ నృత్య ప్రదర్శనలు జరుగుతాని కమిటీ సభ్యులు తెలిపారు.

వేసవి శిక్షణ క్రీడా సామగ్రి ఏమవుతున్నట్లు

- హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వేసవి సెలవుల్లో బాలబాలికలకు అందిస్తున్న క్రీడా వస్తువులు ఏమవుతున్నట్లు అని హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఇడగొట్టు నాగేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సంవత్సరం టెండర్ ద్వారా క్రీడా సామగ్రిని అందిస్తుందన్నారు. అయితే టెండర్ పొందిన వ్యక్తి ప్రతి సంవత్సరం వేసవి సెలవుల్లో మొదట్లో కాకుండా చివరి వారంలో క్రీడా సామగ్రి అందించడం జరుగుతోందని, వేసవి సెలవులు ముగింపులో సామగ్రి అందించడం వల్ల క్రీడాకారులకు పూర్తి స్థాయిలో అందడం లేదన్నారు. అందినప్పటికీ 10 శాతం కంటే ఎక్కువ అందడం లేదన్నారు. దీన్నిబట్టి అధికారులు క్రీడా సామగ్రిని పక్కదారి పట్టిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయని జిల్లా స్పోర్ట్స్ అధికారుల ప్రకటిస్తున్నపటికీ అవి ఎక్కడ జరుగుతున్నాయో తెలియడం లేదన్నారు. ఈ విషయాన్ని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

మున్సిపల్ సిబ్బంది పనితీరుపై కమిషనర్ ఆరా



ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

రాజంపేట టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలో మున్సిపాలిటీ సిబ్బంది పనితీరుపై కమిషనర్ ఆరా తీస్తున్నారు. గురువారం పట్టణంలో డోర్ టు డోర్ చెత్తసేకరణకు సంబంధించి ప్రజలతో మాట్లాడారు. తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా అందిస్తున్నారా.. మీకు మున్సిపల్ సిబ్బంది సహకరిస్తున్నారా... అని అడిగి తెలుసుకున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలను పంపిణీ చేస్తున్న ఎస్ఐ రవీంద్రబాబు

లక్కిరెడ్డిపల్లె, మే15(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం అనా ఎస్ఐ రవీంద్రబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో దాదాపు 250 పూల మొక్కలను, పండ్ల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చెట్ల వల్ల ఆక్సిజన్ ఉత్పత్తి చేయడం, వాతావరణ నియంత్రించడం, నేల కాలుష్యాన్ని తగ్గించడం, వన్య ప్రాణులకు ఆశ్రయం కల్పించడం, భూమిని సారవంతంగా ఉంచడం వంటి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. మొక్కలు ఆహారం, మందులను కూడా అందిస్తాయన్నారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని కాలుష్యం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు.

సమ్మెను జయప్రదం చేద్దాం

- రౌండ్ టేబుల్ సమావేశంలో రైతు, కార్మిక సంఘాల నేతలు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు

రాయచోటిటౌన్, మే15(ఆంధ్రజ్యోతి): కార్మికుల నడ్డి విరిచేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు అయ్యేంత వరకు పోరాడతామని రైతు, కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించారు. గురువారం రాయచోటి పట్టంలోని ఎన్జీవో హోంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు విశ్వనాథ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, ప్రైవేటు ఎలక్ట్రికల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అస్లాం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, శంకరయ్య, యూఈసీడబ్ల్యుయూ డిస్కమ్ నాయకుడు సుబ్రమణ్యంరాజు, రైతు సంఘం ఉపాధ్యక్షులు నాగబసిరెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఓబులమ్మ తదితరులు మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం లేబర్ కోడ్స్ తేవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి కార్మిక ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

దాంపత్య దక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రైల్వేకోడూరు, మే 15(ఆంధ్రజ్యోతి): భుజంగేశ్వర స్వామి ఆలయంలో వెలసిన దాంపత్య దక్షిణామూర్తి గురువారం ఆలయ ప్రధాన అర్చకులు బోయకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, దూర్జటి యోగీశ్వర్‌శర్మ ఆధ్వర్యంలో అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపటి నుంచి కస్తూరమ్మ తిరునాళ్లు



కస్తూరమ్మ తల్లి

సుండుపల్లె, మే15(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాతీ సత్రం సమీపంలో వెలిసిన కస్తూరమ్మ తిరునాళ్ల మహోత్సవాన్ని ఈనెల 17 నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తిరునాళ్లు మూడు రోజుల పాటు ఉంటుందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఉపాధి పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

పుల్లంపేట, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అనంతసముద్రం పంచాయతీలో కూలీలకు ఉపాధి పనులు చూపలేదని పాపక్కగారిపల్లెకు చెందిన సుబ్బరాయుడు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించారన్న కారణంతో ఎంపీపీతో ఎంపీడీవో, ఏపీవో కలిసి కూలీలకు పనులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. అయితే సమస్య పరిష్కారమైనట్లు ఫిర్యాదుదారుడు సుబ్బరాయుడి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. సమస్య పరిష్కారం కాకుండానే మెసేజ్ రావడంపై సుబ్బరాయుడు ఏపీవోను నిలదీశారు.

పల్లా దృష్టికి సిద్దవటం సమస్యలు



వినతిపత్రం అందిస్తున్న రాంప్రసాద్

సిద్దవటం, మే 15 (ఆంధ్రజ్యోతి):టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధి పార్ల రాంప్రసాద్ గురువారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిసి మండల సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా పార్ల రాంప్రసాద్ మాట్లాడుతూ సిద్దవటం ప్రధా నరహదారి విస్తరణ, మాచుపల్లె, ఖాదర్‌బంగ్లా, పెన్నానదిపై, వంతెన నిర్మాణ పనుల విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తామనిహామీ ఇచ్చినట్లు తెలిపారు.

మద్యం పట్టివేత - కేసు నమోదు

సిద్దవటం, మే 15 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మాచుపల్లె గ్రామవాసి కొండయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొండయ్య నుంచి 40 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.4580 ఉంటుందన్నారు.

ఎర్రచెరువుపల్లె

ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా

నందలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రచెరవుపల్లె(వైసీపల్లె) ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడినట్లు రాధాకృష్ణంరాజు, ఈవోఆర్డీ సునీల్‌కుమార్ తెలియజేశారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ వార్డుమెంబర్లు హాజరు కాని కారణంగా ఈ ఎన్నిక వాయిదా పడిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ఎన్నిక జరిగే తేదీని ప్రకటిస్తారని వారు పేర్కొన్నారు.

18న మెగా వైద్య శిబిరం

సుండుపల్లె, మే15(ఆంధ్రజ్యోతి): మెగా ఉచిత వైద్య శిబిరం ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ సత్రం సమీపంలోని కస్తూరమ్మ ఆలయం వద్ద వెంకటలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ కడప, హోలిస్టిక్ హస్పిటల్, పుష్పగిరి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు.

బ్యాంకు అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం

- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖ ఏజీఎం

వీరబల్లి, మే15(ఆంధ్రజ్యోతి): బ్యాంకు అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖ ఏజీఎం సుశాంత్‌కుమార్ స్వరా అన్నా రు. వీరబల్లిలో నూతన భవనాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాత భవనంలో అటు ప్రజలకు, అ ధికారులకు సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతోనే భవనాన్ని మార్చాల్సి వచ్చిందన్నారు. పాత భవనాన్ని త్వరలో కొత్త భవనం నిర్మాణం చేయడానికి చర్యలు తీసుకుంటానన్నారు. బ్యాంకులు ఎన్ని ఉన్నా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుకు మంచి ఆదరణ ఉందన్నారు. ప్రస్తుతం రైతులకు రూ.2 లక్షల వరకు ష్యూరిటీ సైన్ లేకుండా రుణం అందజేస్తామన్నారు. విదేశీ విద్య, గృహాలకు, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు రుణాలు తక్కువ వడ్డీతో ఇస్తామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. బ్యాంకు మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ రైతులు, ఖాతాదారులకు ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నట్లు తెలిపారు.

రేణుకా యల్లమాంబకు బోనాలు

సిద్దవటం, మే 15 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమాంబ తిరునాళ్ల సందర్భంగా గురువారం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. శాంతినగర్, మాచుపల్లె గ్రామ మహిళలు పాల్గొని డప్పు వాయిద్యాల మధ్య బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశారు.

మారిన వైసీపీ స్వరం

- మా ప్రభుత్వంలో చేయలేకపోయాం
- మీ ప్రభుత్వంలోనైనా చేయండి
- జడ్పీ సమావేశంలో వైసీపీ ప్రజాప్రతినిధులు
- ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ

(5వ పేజీ తరువాయి)

ఈసారైనా ఖరీఫ్‌లో నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌బీకేలలో ఎరువులు లేకపోవడంతో డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్ మాట్లాడుతూ పలానా డీలర్ అని చెప్పితే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అరికట్టకపోతే ఎలా అన్నారు.

మార్కెటింగ్‌శాఖ అధికారులపై చిటపటలు

మార్కెటింగ్‌శాఖ చర్చలో అధికారులపై ప్రజాప్రతినిధులు చిటపటలాడారు. పులివెందుల మార్కెటింగ్‌శాఖ అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విరుచుకుపడ్డారు. వ్యాపారులు సిండికేట్ అయి తక్కువ ధరలను నిర్ణయించడం వలన చీనీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ సిండికేట్ అయిన వ్యాపారులు ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉండేవారే కావడంతో వారి అటలు సాగుతున్నాయన్నారు. వేంపల్లెలో రూ.2.50 కోట్లతో మార్కెట్ యార్డును ప్రారంభించినప్పటికి నిరుపయోగంగా ఉందని జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ కడప మార్కెట్ యార్డులో మౌలిక వసతులు లేక పంట ఉత్పత్తులు వర్షంలో తడిసిపోతున్నాయన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు రావాలి

విద్యాశాఖ చర్చలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సూచించారు. క్వాలిఫైడ్ టీచర్లు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నారని విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి మంచి ఫలితాలను రాబట్టాలన్నారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు కింద మిగిలిపోయిన పనులను పూర్తిచేయాలన్నారు.

ఆర్‌అండ్‌బీ శాఖ చర్చలో

బి.మఠంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలంలో అక్రమంగా షాపులు ఏర్పాటుచేసుకుని నడుపుతున్నారని వాటిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వీరనారాయణరెడ్డి కోరారు. చెన్నూరు ఎంపీపీ సురేశ్, పోరుమామిళ్ల జడ్పీటీసీ చెన్నయ్య తదితరులు తమ మండలాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

రైతులపై కేసులు పెట్టడం సరికాదు

పెద్దముడియం మండలంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం మంచిదేనని కానీ దీని పేరుతో రైతులకు అన్యాయం చేయడం తగదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అన్నారు. రైతుల అనుమతి లేకుండానే వారి పొలాల్లో సోలార్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. రైతులు అడ్డుపడితే వారిపై కేసులు పెడుతున్నారన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి సోలార్ ప్రాజెక్టు ఎంతో అవసరమన్నారు. సాగుకు పనికిరాని, నిరుపయోగంగా ఉండే భూములలో మాత్రమే ఏర్పాటు చేస్తున్నారన్నారు. మీరు చెప్పినది ఏదైనా ఉంటే విచారణ జరిపించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

హార్టికల్చర్ హబ్‌గా కడప

రాయలసీమలోని కడప జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చామని కలెక్టర్ పేర్కొన్నారు. దీంతో లక్ష ఎకరాలను హార్టికల్చర్ కింద సాగుచేయడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇందులో దాదాపు 60వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకం కింద బహు వార్షిక పద్ధతిలో పండ్లతోటల పెంపకం, 40వేల ఎకరాల్లో వార్షిక పద్ధతిలో ఉద్యాన సహాయ అభివృద్ధి పథకం కింద పూలు, కూరగాయల సాగుకు సుముఖంగా ఉన్న రైతులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 2.10 లక్షల మంది అర్హులైన రైతులను పరిశీలిస్తున్నామన్నారు. పులివెందుల నియోజకవర్గంలో పాడా రద్దయిన నేపథ్యంలో రైతులు పైపుల కోసం చెల్లించిన నగదుకు సంబంధించి ఏపీఎంఐపీ ద్వారా న్యాయం చేసే విధంగా కృషిచేస్తామన్నారు. ఈ ఖరీఫ్‌లో వ్యవసాయానికి సంబంధించి సీడ్ ఉత్పత్తి విధానాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గుచూపే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో బోర్లు వేసిన వెంటనే పవర్ కనెక్షన్ ఇవ్వాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు

జడ్పీ నిధుల కేటాయింపులో ఎమ్మెల్యేలకు సమాన ప్రాధాన్యత కల్పించాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సభకు ప్రతిపాదన చేశారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని జడ్పీ ఛైర్మన్ రామగోవిందరెడ్డి తెలిపారు. జడ్పీ నిధులను సభ్యులందరికి సమానంగా ఇచ్చేందుకు చర్యలు చేపడతామన్నారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. అందరి సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఎమ్మెల్సీలు రామగోపాల్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి

రూ.13.53 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

- ఇప్పటికే 251 పనులు పూర్తి
- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ

పీలేరు రూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పీలేరు నియోజకవర్గంలో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ఊపందుకుంది. మొదటి విడతలో రూ.13.53 కోట్లతో 30.24 కిలోమీటర్లు సీసీ రోడ్ల నిర్మాణం కోసం 282 పనులు చేపట్టారు. ఇందులో వాల్మీకిపురంలో ప్రహరీ నిర్మాణం పోను మిగిలిన 281 పనులు సీసీ రోడ్లు కావడం గమనార్హం.





పీలేరు ఎన్టీఆర్‌నగర్‌లో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి (ఫైల్)- పీలేరులో నిర్మించిన సీసీ రోడ్డు

నాణ్యతలో రాజీపడం...



పీలేరు నియోజకవర్గంలో సిమెంట్ రోడ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతోంది. ఎక్కడా క్వాలిటీలో రాజీ పడడం లేదు. పనుల నిర్వహణ, పర్యవేక్షణలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాం. ప్రస్తుతం జరుగుతున్న పనులపై క్వాలిటీ కంట్రోల్ ప్రత్యేక నిఘా ఉంది. కాంట్రాక్టర్లు సైతం పనుల నాణ్యతలో అధికారులపై ఒత్తిడి తేవడం లేదు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాం. ఎక్కడైనా తేడా వస్తే ఇంజనీరింగ్ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- మధుసూదన, డీఈఈ, పంచాయతీరాజ్, పీలేరు.

పీలేరులో రూ.3.81 కోట్లతో 79 పనులు, కేవీ పల్లెలో రూ.1.80 కోట్లతో 23 పనులు, కలకడలో రూ.1.75 కోట్లతో 38 పనులు, కలికిరిలో రూ.2.19 కోట్లతో 51 పనులు, గుర్రంకొండలో రూ.1.73 కోట్లతో 48 పనులు, వాల్మీకిపురంలో రూ.2.41 కోట్లతో 41 పనులు చేపట్టారు. ఇందులో ఇప్పటి వరకు 251 పనులు పూర్తి చేసి 28.38 కిలోమీటర్లు సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మరో 30 పనులు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. పీలేరు పట్టణ శివారు ప్రాంతం ఎన్టీఆర్ కాలనీలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఇటీవల ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించి ప్రారంభించడంతో పాటు అధికారులు, పనులు చేసిన వారిని అభినందించారు.

కొత్తగా రూ. 1.32 కోట్లతో 31 పనులు

మొదటి విడతలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణం దాదాపుగా పూర్తి కావడంతో డిస్ట్రిక్ మినరల్ గ్రాంట్‌లో భాగంగా రూ.1.32 కోట్లతో కొత్తగా 31 పనులు మంజూరయ్యాయి. ఇందులో కలకడలో రూ.19 లక్షలతో 4 పనులు, కలికిరిలో రూ.85.60 లక్షలతో 19 పనులు, పీలేరులో రూ.13 లక్షలతో 3 పనులు, వాల్మీకిపురంలో రూ.15 లక్షలతో 3 పనులు మంజూరు చేశారు.

రూ.10 కోట్లతో కొత్తగా ప్రతిపాదనలు....

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పీలేరు నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి కలెక్టర్, డ్వామా పీడీలకు ప్రతిపాదనలు పంపారు. సీసీ రోడ్లు సత్వరం నిర్మించాల్సిన వివరాలతో ప్రతిపాదనలు పంపారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

మదనపల్లెలో అగ్నిప్రమాదం

- రూ.2 లక్షల ఆస్తినష్టం

మదనపల్లె అర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీలోని బాబునగర్ కాలనీలో గురువారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప వివరాల మేరకు.. వన్నూర్‌సాహెబ్ గుట్ట సమీపంలో లక్ష్మీదేవి, శ్రీనివాసులు నివాసం ఉంటున్న ఇంటికి ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగిందని సమాచారం అందడంతో వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశామన్నారు. ఇందులో సుమారు రెండు లక్షలకు పైగా నష్టం జరిగిందని ఇంటి యాజమాని తెలిపారన్నారు. ప్రమాదంలో ఇంట్లోని బీరువా, బట్టలు, గ్యాస్ స్టవ్, వంట సామగ్రి, ఇంటిపత్రాలు కాలిపోయాయని పేర్కొన్నారు. ఇంట్లోని కరెంట్ మీటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మొదలై అగ్నిప్రమాదం జరిగిందన్నారు. తాలుకా సీఐ కళావెంకటరమణ, అగ్నిమాపక అధికారి శివప్ప, పోలీసులు పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఘనంగా ముగిసిన కొత్తపురమ్మ జాతర



కొత్తపురమ్మ ఆలయ జాతర ప్రాంగణంలో జనం

సంబేపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాలలో కొత్తపురమ్మ జాతర వైభవంగా ముగిసింది. ఏడాదికి ఒకరోజు వచ్చే జాతర ప్రజల్లో సందడిని, సంతోషాన్ని కలిగిస్తున్నాయి. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా జాతరలకు వెళ్లడం ఆ రోజు ఆలయ ప్రాంగణాల్లో సంతోషంగా, సందడిగా గడపడం విశేషం. జాతరలో కనిపించే బంధువులు, స్నేహితులు ఒక్కొక్కరు బాగుండారా అంటూ పలకరింపులు, పిల్లలు బొమ్మలు కావాలని మారాం చేయడం, కావాల్సిన బొమ్మలు కొనడం ఎవరి సందడి వారిది. జాతరల్లో సోది చెప్పించుకోవడం ఇలా ప్రజల్లో ఎక్కడ లేని సంతోషం కనిపిస్తుంది. గురువారం దుద్యాల గ్రామ దేవత కొత్తపురమ్మ జాతర ఘనంగా ముగిసింది. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. భక్తులతో జాతర వాతావరణం కిక్కిరిసిపోయింది. కళ్లిపాటు కార్యక్రమంతో అమ్మవారి జాతర ఘనంగా ముసిగింది.



అమ్మవారికి పొట్టేళ్లు, మేకపోతులతో బోనాలు

తంబళ్లపల్లెలో గాలివాన బీభత్సం





కన్నెమడుగులో గాలివానకు నేలకూలిన విద్యుత్ స్తంభం - సిద్దవటంలో గాలివానకు పడిపోయిన విద్యుత్ స్తంభం

తంబళ్లపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. మండల వ్యాప్తంగా 27.2 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గాలివానకు పలుచోట్ల కోతకు వచ్చిన మామిడికాయలు రాలిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కన్నెమడుగులో విద్యుత్ స్తంభం నేలకూలింది. గాలికి పలుచోట్ల కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరాలో పలుమార్లు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ ఏఈ సురేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

నేలకొరిగిన స్తంభాలు,

సిద్దవటం, మే 15 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం రత్నసభాపతినగర్‌లో గురువారం పెనుగాలుల బీభత్సానికి విద్యుత్ స్తంభాలు, వృక్షాలు నేలకొరిగాయి. గాలులు బీభత్సంతో విద్యుత్ స్తంభాలు 2, పెద్ద వృక్షం పడిపోయాయి. విద్యుత్ ఏఈ జయచంద్ర విద్యుత్ పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టారు.

కిసాన్ మేళా నిర్వహణకు సర్వం సిద్ధం

రైల్వేకోడూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): కిసాన్ మేళా కార్యక్రమం శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన స్థానం ఆవరణంలో నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మామిడి తదితర పంటల ప్రదర్శన కోసం 12 స్టాల్స్ ఏర్పాటు చేశారు. రైతులు, అధికారులు, సిబ్బందికి భోజన సదుపాయాల ఏర్పాటుకు సిద్ధం చేశారు. సమావేశంలో మాట్లాడానికి ప్రతినిధులకు సమావేశ మందిరం ఏర్పాటు చేశారు. జిల్లా నుంచి సుమారు 500 మంది రైతులు వస్తున్నారు. అదేకాకుండా ఉద్యాన విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రదర్శనల ఏర్పాట్లు చేశారు. కిసాన్‌మేళా కార్యక్రమం విజయవంతం చేయాలని ఉద్యాన పరిశోధన స్థానం వారు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌లో పదేపదే ఫిర్యాదులు

- బాధితుడిని విచారించిన సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం బీకేపల్లె రెవెన్యూ గ్రామానికి సంబంధించి భూ వివాదంపై ఓ వ్యక్తి పీజీఆర్ఎస్‌లో పదేపదే ఫిర్యాదులు చేస్తుండడంతో సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ బాధితుడిని పిలిపించి విచారించారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కోర్టు హాల్లో విచారణ చేశారు. ఈ సందర్భంగా బాధితుడు నాగరాజు మీడియాతో మాట్లాడుతూ తనకు, తన కుమార్తెలకు బీకేపల్లె సర్వే నెంబర్లు 424, 425, 433లో మొత్తం 8.83 ఎకరాలు పిత్రార్జితంగా వచ్చిన భూమికి 2017 సంవత్సరం వరకు 1బి, అడంగల్ వుండేవన్నారు. తరువాత వచ్చిన రెవెన్యూ అధికారులు ఈ భూమిని నోషనల్ ఖాతాలో ఎక్కించారని, అప్పటి నుంచి తమ భూమికి పాసుపుస్తకం మంజూరు చేయాలని ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా, సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై సబ్‌కలెక్టర్ తనను విచారించారని సంబంధిత భూమి చుట్టూ కంచె వేసుకుని తమ ఆధీనంలో వుంచుకుంటే, రెవెన్యూ అధికారులు వచ్చి సబ్ డివిజన్ చేసి పాసుపుస్తకాలు ఇస్తామని చెబుతున్నారని బాధితుడు తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

నిమ్మనపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని వెంగంవారిపల్లికి చెందిన ఓ మహిళతో బి.కొత్తకోటకు చెందిన అభిలాష్‌రెడ్డి (28) ఫేస్‌బుక్ ద్వారా పరిచయాన్ని పెంచుకున్నారు. వీరి పరిచయం దాదాపు నాలుగేళ్లుగా కొనసాగింది. కాగా కొన్ని రోజులుగా అభిలాష్‌రెడ్డి తనకు రూ.20 లక్షలు ఇవ్వాలని ఆ మహిళను వేధింపులకు గురిచేసేవాడు. అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే ఫేస్‌బుక్‌లో తమ సంభాషణను బయటపెడతానని బెదిరించాడు. దీంతో ఆ మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అభిలాష్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదోన్నతుల కోసం ఎదురుచూపు...!



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

- ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఉపాధి హామీ ఉద్యోగుల ఆశలన్నీ కూటమి ప్రభుత్వంపైనే..!

మదనపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులు పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరిని ఏమాత్రం పట్టించుకోకపోగా పదోన్నతులతో పాటు పీఆర్‌సీని కూడా పక్కనపెట్టిందని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులు 19 నుంచి 23 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అయిదేళ్ల వైసీపీ ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకారం 23 శాతం జీతాలు పెంచకపోగా, పదోన్నతులు కూడా కల్పించలేదు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మాతృశాఖలో పనిచేస్తున్న ఉపాధి హామీ, డ్వామా ఉద్యోగులకు టైం స్కేల్ అమలుకు శ్రీకారం చుట్టి చరిత్ర సృష్టించింది. 2014-2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అర్హులైన ఫీల్డ్ అసిస్టెంట్లను సాంకేతిక సహాయకులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ ఇంజనీర్లకు, ఎంటీసీలకు అదనపు కార్యక్రమ అధికారుల (ఏపీవో) లుగాను, హెచ్‌ఆర్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించారు. అలాగే కలెక్టర్ అధ్యక్షతన జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత విద్యార్హతలు కలిగి, రూల్ ఆఫ్ రిజర్వేషన్‌తో నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపికైన డిప్యూటీ తహసీల్దార్, ఈవోఆర్‌డీ కేడర్లలో (జీవో ఆర్.టి.నంబర్ 312, 2006) నియమితులైన ఏపీవోలు, అలాగే ఈసీలు, కోర్స్ డైరెక్టర్లు, హెచ్‌ఆర్ మేనేజర్లు, ప్లాంటేషన్ మేనేజర్లు, సహాయ పథక సంచాలకులు(ఏపీడీ)గా పదోన్నతి పొందారు. ఏపీడీలు అడిషనల్ పీడీలుగా పదోన్నతి పొందారు.

ఉపాధిహామీ పథకం అమలులో వస్తున్న మార్పులకు అనుగుణంగా అత్యున్నత పరిజ్ఞానంతో రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో అవగాహన కల్పించడం, అమలుపరచడం, పర్యవేక్షణ చేయడం, పరిపాలనాపరమైన అంశాలలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఉపాధి హామీ ఉద్యోగులు అన్ని క్యాడర్లలోనూ పదోన్నతులకు అర్హులేనని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ గ్రావెల్, బి.టి, సిమెంట్ రోడ్లు, సచివాలయ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్త్రీ శక్తి, రైతుసేవా, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాల ప్రహరీగోడల నిర్మాణం, తదితర మౌలిక వసతులు కల్పించడంలో ఉపాధి హామీ ఉద్యోగుల భాగస్వామ్యం అధికంగా ఉంది. అలాగే అటవీ, వ్యవసాయ, పంచాయతీరాజ్, విద్య, వైద్య, రైల్వే, జలవనరులు, ఉద్యానవన, పట్టు పరిశ్రమ మొదలైన ఇతర శాఖల సమన్వయంతో రైతు సంక్షేమ పథకాలు ఉపాధి హామీ ద్వారానే జరుగుతున్నాయి. ఇందులో పనిచేస్తున్న ఎఫ్‌టీఈ ఉద్యోగులకు గ్రామీణాభివృద్ధి శాఖలో 70 శాతం పదోన్నతులు కల్పించాలనే డిమాండ్ ఉంది. గ్రామీణాభివృద్ధి శాఖలో ఎస్‌ఆర్‌డీఎస్ కింద పనిచేస్తున్న ఎఫ్‌టీఈల నియామకం తేదీ, తదితర పొరపాట్లను సరిదిద్దాలని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి ప్రస్తుతం ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలని, ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న ఉద్యోగులను ఎఫ్‌టీఈలుగా గుర్తించాలని పలువురు కోరుతున్నారు.

వంకలనూ వదలని అధికార పార్టీ నేతలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నేతలు వంకలు, వాగులనూ వదలడం లేదని, సీటీఎం వద్ద స్పిన్నింగ్ మిల్లును కొనుగోలు చేసిన రియల్టర్లు వంక భూములను అక్రమించి ప్లాట్లుగా మారుస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం సీపీఎం కార్యకర్తలతో కలిసి వెళ్లి ఈ అక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ సర్వేనంబరు 744, 745, 795ల గుండా ప్రవహించే రెండు వాగులను, నేతాజీ కాలనీ నుంచి వచ్చే మురుగుకాలువను పూర్తిగా పూడ్చివేసి ప్లాట్లుగా మారుస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అంతేకాకుండా మదనపల్లె చుట్టుపక్కల అక్రమ లేవుట్లు అధికమయ్యాయన్నారు. భూమి ఆక్రమణలు జరిగితే సహించేది లేదన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వాగులు, వంకలు భూములను కాపాడకపోతే ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అశోక్, నరసింహ, రమణ, జయరాం, ఆఫ్రిద్ పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో రెస్టారెంట్‌కు వెసులుబాటు

● ప్రాంగణంలోనే ఇంకుడుగుంతల నిర్మాణానికి అనుమతి

బి.కొత్తకోట, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో వీఎస్‌ఆర్ విండ్‌వేవ్ పేరుతో నడుస్తున్న ప్రైవేటు రెస్టారెంట్‌కు అధికారులు వెసులుబాటు కల్పించారు. ఈ నెల 9న ఈ రెస్టారెంట్‌ను అధికారులు సీజ్‌చేసిన విషయం తెలిసిందే. ఈ రెస్టారెంట్ నిబంధనలు పాటించడం లేదని, మురుగునీరు, వ్యర్థాలను పర్యాటకులు సంచరించే గాలిబండ వైపు వదులుతున్నారని ఆగ్రహించిన కలెక్టర్ శ్రీధర్ ఈ ఆదేశాలిచ్చారు. దీంతో తహశీల్దార్ అజారుద్దీన్ సిబ్బంది రెస్టారెంట్, లాడ్జ్‌ను ఖాళీ చేయించి సీజ్ చేశారు. దీంతో రెస్టారెంట్ యజమాని సుధాకర్‌రెడ్డి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఈ నేపథ్యంలో రెస్టారెంట్ లోపలి ప్రదేశంలోనే ఇంకుడు గుంతల లాంటివి అధికారుల పర్యవేక్షణలో నిర్మించుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలందాయి. ఆర్‌డబ్ల్యుయస్ ఏఈ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వీరాంజినేయులు హిల్స్‌కు వెళ్లి గుంతల నిర్మాణాలపై సూచనలిచ్చారు. దీంతో అక్కడ పనులు చేపట్టారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడి మృతి



దొరబాబు మృతదేహం

మైలవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి గురువారం ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. పెద్దకొమెర్ల గ్రామానికి చెందిన తెల్లదొరబాబు (23) అనే యువకుడు గ్రామం నుంచి ఇసుక ట్రాక్టర్ లోడు తీసుకుని రాత్రి 11.30 గంటలకు కోవెలకుంట్లకు బయలుదేరాడు. గ్రామ సచివాలయ సమీపంలోని చిన్నకొమెర్లకు వచ్చే రహదారిలో ట్రాక్టర్ వేగాన్ని అదుపు చేయలేకపోవడంతోపక్కనే ఉన్న గుంతలో పడి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో టైరుకింద పడిన దొరబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. తలమంచిపట్నం ఎస్‌ఐ లక్ష్మినారాయణ, పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దొరబాబు తండ్రి వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బెంగళూరులో రైలుకింద పడి యువకుడి..



శివానందరెడ్డి (ఫైల్)

కలసపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహానందిపల్లె గ్రామానికి చెందిన బిజివేముల శివానందరెడ్డి (25) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బెంగుళూరులో రైలుకింద పడి మృతి చెందాడు. నందిపల్లె గ్రామానికి చెందిన పుల్లారెడ్డి కుమారుడు శివానందరెడ్డికి 9 నెలల క్రితం పోరుమామిళ్ల మండలానికి చెందిన ఓ యువతితో వివాహమైంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఇతను కేఆర్‌పురం సమీపంలోని రైలు పట్టాలపై గురువారం శవమై కనిపించినట్లు బంధువులు తెలిపారు. శివానందరెడ్డి మృతితో మహానందిపల్లెలో విషా దచ్ఛాయలు అలుముకున్నాయి.

తెలుగుగంగ కాల్వలో గుర్తుతెలియని శవం

కలసపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని ఆర్‌సీఎం చర్చి వెనక భాగంలో ఉన్న తెలుగుగంగ కాల్వలో గురువారం ఓ గుర్తు తెలియని శవం లభ్యమైంది. మృతుడి వయసు 60 సంవత్సరాలకు పైబడి ఉంటుందని, కాషాయవస్త్రాలు ధరించి ఉన్నారు. గుర్తు పట్టలేని విధంగా కుళ్లి ఉన్న శవాన్ని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు, కలసపాడు ఎస్‌ఐ తిమోతి పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



పట్టుబడిన వ్యక్తులతో సీఐ శివశంకర్, ఎస్‌ఐ వినోద్‌కుమార్

దువ్వూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపారు. దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామంలో ఈనెల 12వ తేదీ స్థలం విషయమై జరిగిన ఘర్షణలో కందుకూరి నారాయణ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ కేసు విషయంలో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మైదుకూరులోని ఓ హోటల్ వద్ద గురువారం తెల్లవారుజామున నిందితులను అరెస్టు చేసి.. కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు సీఐతోపాటు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

రాళ్లదాడి హత్యపై డీఎస్పీ విచారణ

చక్రాయపేట, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి కోమటిపేటకు చెందిన కందుల చంటి అనే యువకుడి హత్య కేసుకు సంబంధించి గురువారం డీఎస్పీ మురళీనాయక్ విచారణ చేపట్టారు. చంటిని ముగ్గురు వ్యక్తులు రాళ్లతో దాడి చేసి హత్య చేయడంతో వారిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఈనేపథ్యంలో గురువారం హత్య జరిగిన సంఘటన స్థలానికి సీఐ ఉలసయ్య, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు వెళ్లి పరిశీలించారు.

ఘర్షణ కేసులో నలుగురు అరెస్టు

జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూర్వపు బొమ్మేపల్లెలో ఈనెల 10వ తేదీ సాయంత్రం ఇంటి ముందు పేడనీళ్లు చల్లే విషయంలో ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో 13 మంది గాయపడగా... ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజచౌడప్ప (30) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి గురువారం బొగ్గు మల్లికార్జున, శివకృష్ణ, మునేశ్వరుడు, నాగేంద్ర అనే నలుగురిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఎస్‌ఐలు హైమావతి, రామకృష్ణ, వారి సిబ్బంది పాల్గొన్నారు.

జాతర వివాదం కొలిక్కి వచ్చేనా..!

● నూతన ధర్మకర్తగా రామమోహన్‌రెడ్డికి బాధ్యతల అప్పగింత

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరులో వున్న ప్రముఖ గ్రామ దేవత మూలస్థానమ్మ జాతర వివాదం ఒక కొలిక్కి వచ్చినట్లే వచ్చి చివరికి మళ్లీ పీటముడి పడింది. ఆలయ నిర్వహణ, జాతర ఏర్పాట్ల కోసం అద్దవారిపల్లెకు చెందిన ఇరువురు ధర్మకర్తలు పోటాపోటీగా తేదీలు ప్రకటించి వివాదానికి తెరతీసిన విషయం తెలిసిందే. ధర్మకర్తల మధ్య సయోధ్య కోసం కలికిరి పోలీసుస్టేషన్‌లో గత సోమవారం పంచాయితీ జరిగిన విషయం కూడా తెలిసిందే. సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి ఇరు వర్గాలతో చర్చలు జరిపిన దరిమిలా ఒక ధర్మకర్త వెంకటేశ్వరరెడ్డి ఈ ఏడాది జాతర జరిపేందుకు మరో ధర్మకర్త భాస్కర్ రెడ్డి కూడా అంగీకరించారు. అయితే చివర్లో గ్రామస్తులు మెలిక పెట్టారు. ఇది ఇరువురు ధర్మకర్తల మధ్య సమస్య కాదని, గ్రామస్థుల సమక్షంలో నిర్ణయం జరగాలని తేల్చి చెప్పడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఈ పరిణామాల అనంతరం గురువారం అమ్మవారి ఆలయంలో గుండ్లూరు ప్రజలు సమావేశమై తదుపరి



మూలస్థానమ్మ ఆలయంలో సమావేశమైన పాత ధర్మకర్తలు, గ్రామస్తులు

నిర్ణయాల కోసం సుదీర్ఘంగా తర్జనభర్జనలు పడ్డారు. ఈ సమావేశానికి ఇరువురు ధర్మకర్తలు కూడా హాజరై తమ తమ వాదనలు వినిపించారు. చివరగా రెడ్డి వారి కుటుంబానికి చెందిన ఆర్.రామమోహన్‌రెడ్డికి ఆలయ బాధ్యతలు అప్పజెపుతూ గ్రామస్తులు తీర్మానించారు. జూన్ 7, 8, 9 తేదీల్లో జాతర తేదీలను కూడా ఖరారు చేశారు. ఆ మేరకు గ్రామస్తులు సంతకాలు చేశారు. గ్రామస్తుల తీర్మానాలను గురువారం సీఐ రెడ్డిశేఖర్ రెడ్డికి అందజేశారు. సర్పంచు సైపుల్లా, గుండ్లూరు, అద్దవారిపల్లె మాజీ సర్పంచులు మురళీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్‌రెడ్డితో పాటు నూతన ధర్మకర్త రామమోహన్‌రెడ్డి గ్రామస్తుల నిర్ణయాన్ని సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డికి అందజేశారు. అందరూ కలిసికట్టుగా వుండి జాతరను వైభవంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా సీఐ పలు సూచనలు చేశారు. అంతా ఒక కొలిక్కి వచ్చి వివాదం సమసిపోయిందనుకుంటుండగా తాను ఈ నిర్ణయానికి పూర్తిగా కట్టుబడలేదని మరో ధర్మకర్త వెంకటేశ్వరరెడ్డి గురువారం సాయంత్రం ఆంధ్రజ్యోతికి ఫోను చేసి చెప్పారు. గత ఐదేళ్ల ఆలయ ఆదాయ వ్యయాలకు సంబంధించిన లెక్కలు చెప్పాలని, అదే విధంగా ఆలయానికి చెందిన ఒకటిన్నర కిలోల వెండి ఆభరణాలను అప్పగించాలని, తదితరవి నెరవేరిస్తేనే తీర్మానాన్ని అంగీకరిస్తానని ఆయన స్పష్టం చేశారు. తీర్మానంలో తాను సంతకం చేయలేదని కూడా చెప్పారు. ఇదే విషయాన్ని తాను సీఐకి కూడా వివరించినట్లు తెలిపారు. ఏదేమైనా జాతర వివాదం కొలిక్కి వచ్చేనా అని పలువురు చర్చించుకుంటున్నారు.

భక్తి శ్రద్ధలతో గంగరాళ్లకు జలాభిషేకం



జలకలశాలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

వాల్మీకిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనల్లవీరగంగాభవానీ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం మహిళలంతా భక్తిశ్రద్ధలతో గంగరాళ్లకు జలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద నుంచి 108 జలకలశాలతో మహిళలు మంగళవాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల గుండా నగరోత్సవం నిర్వహించి స్థానిక కోనేటివీధి, నాయక్‌వీధులలో గల గంగరాళ్లకు జలాభిషేకం, పసుపుకుంకుమ, వేపాకులతో పూజలు చేశారు. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త మొగ్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఆనందశెట్టి, రమణారెడ్డి, బలరాం, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రమౌళి, మాజీ సర్పంచ్ రాజేంద్రాచారి, టమోటా రామచంద్ర, రవి, విజయకుమార్, అర్చకులు జనార్దనస్వామి, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కలకడ, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాటవారిపల్లె హైస్కూల్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాటవారిపల్లెకు చెందిన నాగార్జున్(33) సొంత పనుల నిమిత్తం కలకడకు వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళుతుండగా సోమలకు వెళుతున్న కడపకు చెందిన శివ(23) ద్విచక్ర వాహనంలో వస్తుండగా వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగార్జున కుడికాలుకు, శివ ఎడమ చేతికి గాయాలయ్యాయి. బాధితులను 108లో ఈఎంటీ రవి, పైలెట్ శ్రీనివాసులు పీలేరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

కడప పశు సంవర్ధక శాఖ డీడీ అచ్చన్న హత్య కేసులో ప్రత్యేక కౌన్సిల్ నియామకం

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చిన్న అచ్చన్న 2023లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున వాదించడానికి ప్రత్యేక కౌన్సెల్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) నివేదిక మేరకు ఈ నియామకం చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. క్రైమ్ నంబరు 113/2023లో కడప 1వ పోలీసు స్టేషన్‌లో ఈ హత్య కేసు నమోదయ్యింది. ఇందులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు కూడా జతచేశారు. ఈ కేసు కడప నాలుగవ అదనపు జిల్లా జడ్జి (ఎస్సీ, ఎస్టీ కోర్టు) విచారణలో వుంది. ప్రభుత్వం తరపున ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించడానికి స్థానిక బార్ అసోసియేషన్ సభ్యుడు మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ మూర్తిని ప్రత్యేక కౌన్సెల్‌గా నియమించింది. ఈ మేరకు డీజీపీ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా కూడా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు.

నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ, ఎంఏ, ఎంకామ్ నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను గురువారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఏ తెలుగు, హిస్టరీ, పీఎస్ అండ్ పీఏ, ఎకనామిక్స్, ఉర్దూ ఎంకామ్ కోర్సులలో విద్యార్థులు వంద శాతం ఫలితాలను సొంతం చేసుకున్నారని తెలి పారు. అఫిలియేటెడ్ కాలేజీల్లో ఎంకామ్‌లో 96.30 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. ఎమ్మెస్సీ బోటనీ, బయోకెమిస్ట్రీ, జియాలజీ, మేథమేటిక్స్ మైక్రోబయాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎన్విరాన్ మెంటల్ సైన్స్, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్, ఫుడ్ టెక్నాలజీ, ఎంపీఈడీ కోర్సులలో వందశాతం ఉత్తీర్ణత లభించిందన్నారు. ఫిజిక్స్ 90శాతం, జువాలజీ 96.97 శాతం, బయోటెక్నాలజీ 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పాల్గొన్నారు.

గోపవరం మండలంలో జేసీ పర్యటన

గోపవరం, మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎంబజీ లేఅవుట్‌ను గురువారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ సందర్శించి పరిశీలించారు. ఎంబజీ లేఅవుట్‌లో భూములు కోల్పోయిన వారికి అసైన్‌మెంటు ద్వారా కేటాయించిన భూములను పరిశీలించారు. ప్రాజెక్టు కాలనీ-2లో రేషన్‌షాపును తనిఖీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధి కారి చంద్రమోహన్, కుడా సెక్రటరీ శిరీషా, త్రిభువన్‌రెడ్డి గోపవరం తహసీల్దారు తదితరులు పాల్గొన్నారు.

మూడు కోర్టులకు శాశ్వత అడ్వాన్సు నిధులు మంజూరు

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలోని మూడు న్యాయస్థానాలకు నిర్వహణ వ్యయం కోసం శాశ్వత అడ్వాన్సు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం గురువారం ఆదేశాలు జారీ చేసింది. కడపలోని పోక్సో ప్రత్యేక కోర్టుకు రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం నెలకు రూ.3000, బద్వేలులోని సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్)కు రూ.2000, కడపలోని ఏడవ అదనపు జిల్లా కోర్టు (మహిళలపై జరిగే నేరాల విచారణకు ప్రత్యేక కోర్టు)కు రూ.3000 వంతున శాశ్వత అడ్వాన్సు నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు న్యాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి జి.ప్రతిభాదేవి గురువారం విడివిడిగా ఉత్తర్వులు జారీ చేశారు.

గరుడ వాహనంపై నారాపురం వేంకటేశ్వరస్వామి



జమ్మలమడుగు, మే 15 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నారాపురం వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం 5వ రోజు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో శ్రీవారికి మోహిని ఉత్సవం చేశారు. అనంతరం స్నపన తిరుమంజసం, ఊంజల్‌సేవ, అన్నమాచార్య కీర్తనలు నిర్వహించారు. రాత్రి అలంకరణ మండపంలో గరుడవాహనంపై అలంకరించి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పండితులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

పిడుగుపడి వ్యక్తి మృతి



పులివెందుల, మే 15 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలం కోరవానిపల్లెకు చెందిన గొర్ల కాపరి బొబ్బూరి చంద్రశేఖర్ (26) పిడుగుపడి మృతి చెందాడు. వివరాలిలా.. బొబ్బూరి చంద్రశేఖర్ ఆళ్లగడ్డ మండలం చిన్న బోదనం తిప్పనపల్లె గ్రామాల మధ్య తన గొర్ల దొడ్డిలో కాపలాకోసం నిద్రించాడు. బుధవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా పిడుగుపడి మరణించాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాఛాయలు అలుముకున్నాయి.

చెట్టును ఢీకొన్న లారీ

● అంతకు ముందు ద్విచక్ర వాహనం, బస్సును సైతం ఢీ
● ఐదుగురికి గాయాలు ● మద్యం మత్తే కారణం



వల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో లారీని నడిపిన డ్రైవరు ఒక ద్విచక్ర వాహనాన్ని, ఆ వెంటనే ప్రైవేటు బస్సును ఢీకొట్టి అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కిరాణా బంకును, దాని పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. దీంతో ఐదుగురికి గాయాలు కాగా.. కిరాణా బంకుతో పాటు మూడు ద్విచక్ర వాహనాలు, బస్సు దెబ్బతిన్నాయి. వివరాలిలా.. అనంతపురం జిల్లా యల్లనూరు మండలం తిరుమలపురానికి చెందిన లారీడ్రైవరు షేక్ అబ్దుల్లా అహ్మద్ గురువారం కడప నుంచి లారీలో గుజరీ సామాన్లను లోడు చేసుకుని తాడిపత్రి వైపునకు వెళుతున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఇతను మండల పరిధిలోని పాపాఘ్నినగర్ (కట్ట) బస్టాపు వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఆ వెంటనే ఓ ప్రైవేటు బస్సును, అనంతరం రోడ్డు పక్కన చిల్లర దుకాణం బంకును, దాని పక్కనే పార్కు చేసి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలను తొక్కించాడు. చివరకు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. దీంతో క్యాబిన్‌లోనే డ్రైవర్ ఇరుక్కుపోయాడు. స్థానికులు అతన్ని బయటికి తీయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పెద్ద ఓబన్న సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సాయంతో సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి ఎట్టకేలకు డ్రైవరును బయటికి తీశారు. చికిత్స కోసం 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా వెంకట్రమణస్వామి కుంబాభిషేకం

బి.కొత్తకోట, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టులో వెలసిన శ్రీప్రసన్న వెంకటకమణ స్వాముల వారి ఆలయం నందు నూతన ధ్వజస్తంభ ప్రతిష్టాపన, మహాకుంబాభిషేక వేడుక రెండు రోజులు పాటు వైభవంగా నిర్వహించారు. గురువారం అర్చకులు మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, కైంకర్యాలతో దివ్యంగా అలంకరించారు. కార్యక్రమంలో వంశ పారంపర్య ధర్మకర్త, టీటీడీ మాజీసభ్యులు అల్లూరి సుబ్రమణ్యం, కుటుంబీకులు, గట్టు, నాయనబావి, మొటుకుపల్లి, బయప్పగారిపల్లె గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు కేశాలు దానం



కేశాలు దానం చేస్తున్న యువతులు

మదనపల్లె అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): స్థానిక హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో గురువారం మదనపల్లెకు చెందిన రజని, తన కుమార్తె హేవిత తమ కేశాలను దానం చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు అబూబక్కర్ వారిని అభినందిస్తూ పూలమొక్కలను, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో సభ్యులు కిరణ్, చైతు, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికులకు అశ్రు నివాళి

వాల్మీకిపురం, మే 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్థాన్ జరిపిన దాడుల్లో దేశ రక్షణకై అమరులైన భరతమాత వీర సైనికులకు వాల్మీకిపురం పట్టణ ప్రజలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గంగాభవాని ఆలయం వద్ద అమరులైన వీర సైనికుల చిత్రపటాల ముందు నివాళులర్పించి భారత్ మాతాకి జై నినాదాలతో హోరెత్తించారు. అమరవీరుల సైనిక కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పట్టణ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ జయంతి

అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలను గురువారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకిపురం ప్రభుత్వ గ్రంథాలయంలో కాటన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

● పెళ్లైన నాలుగు నెలలకే ఆత్మహత్యకు దారితీసిన వైనం



అర్షియాబేగం మృతదేహం

పులివెందుల, మే 15 (ఆంధ్రజ్యోతి): పులివెందులలోని నగరిగుట్టకు చెందిన అర్షియా బేగం (18) భర్త ఫయాజ్ ఫకృద్దీన్ చిత్రహింసలు తాళలేక ఆత్మహత్య చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే... పట్టణంలోని నగరిగుట్టకు చెందిన అర్షియాబేగం అదే ఏరియాకు చెందిన ఫయాజ్ ఫకృద్దీన్ ఇరువురు ప్రేమించుకొని ఈ ఏడాది జనవరిలో వివాహం చేసుకున్నారు. ప్రేమించిన వాడితో జీవితం సంతోషంగా ఉంటుందని అర్షియాబేగం భావించింది. వివాహం చేసుకున్న మరుసటి రోజు నుంచే భర్త వేధింపులు మొదలయ్యాయి. అర్షియాబేగం తల్లి జైబున్నిషా దుబాయ్‌లో ఉంటోంది. తండ్రి కరీముల్లా తిరుమలలో ఓ షాపులో పని చేస్తుంటారు. అర్షియాబేగం తన అమ్మమ్మ అయిన బున్ని దగ్గర ఉండేది. పెళ్లిచేసుకున్న నాటి నుంచి అర్షియాబేగంను భర్త చిత్రహింసలు పెట్టడం ప్రారంభించారు. అర్షియాబేగం అమ్మమ్మ బున్నీని డబ్బుల కోసం ఇబ్బందులు పెట్టేవాడు. ఇటీవల కొంతమొత్తాన్ని తీసుకొని బైకు కూడా కొనుగోలు చేశాడు. ఫయాజ్ ఫకృద్దీన్ ఓ చికెన్ షాపులో పని చేస్తుంటాడు. బుధవారం రాత్రి డబ్బు కోసం అర్షియాబేగంతో చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన అర్షియాబేగం ఉరివేసుకొని చనిపోతానని భర్తకు చెప్పింది. కానీ భర్త ఆమె మాటలను పట్టించుకోకపోవడంతో బుధవారం అర్ధరాత్రి వంట రూములోకి వెళ్లి అర్షియా బేగం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు



పెద్దమండ్యం, మే 15(ఆంధ్రజ్యోతి): నూతన ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ పీవీ రమణ అన్నమయ్య డీఎస్‌బీ ఎస్‌ఐ-3గా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలన్నారు. అపరిచితుల సంచారం, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలన్నారు.

హంద్రీ-నీవా జలాలతో సస్యశ్యామలం చేస్తాం

- నేడు మంత్రి రామానాయుడు లైనింగ్ పనులు పరిశీలన
- టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 15(ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా జలాలతో కరువు ప్రాంతాన్ని శాశ్వితంగా సస్యశ్యామలం చేయడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 74 కి.మీ. మేర హంద్రీ-నీవా కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. జూలై లోగా లైనింగ్ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలో 1.92 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. నియోజకవర్గంలో 39 చెరువులకు హంద్రీ-నీవా జలాలు మళ్లించి బీడుగా ఉన్న ప్రతి ఎకరాను సాగులోకి తెస్తామన్నారు. కోస్తాఆంధ్రా, కోనసీమ తరహాలో రాయలసీమలో ఎక్కడ చూసినా నీరుండాలని కృష్ణా జలాలు తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు 1996లో హంద్రీ-నీవాను మొదలుపెట్టారన్నారు. హంద్రీ-నీవా కాలువ ఎక్కడ చూసినా తెగిపోవడం, కంపచెట్లు భారీగా మొలుస్తుండడంతో నీరు సరిగా పారకపోవడంతో అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు పటిష్ఠం చేసేందుకు కాంక్రీట్ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. నియోజకవర్గంలో 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. జూన్ ఆఖరుకల్లా కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తవుతాయన్నారు. ఈ క్రమంలోనే జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటించి హంద్రీ - నీవా లైనింగ్ పనులు పరిశీలిస్తారన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకాలన్నారు. అంతకు మునుపు ములకలచెరువులో పుడమి కిసాన్ మార్ట్‌ను ప్రారంభించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని సూచించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, కురబలకోట మండల కన్వీనర్ వైజీ సురేంద్రయాదవ్, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, నాయకులు జనార్ధన్‌రెడ్డి, ఫజులు, ఎర్రంరెడ్డి, శ్రీనివాసులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా పబ్లిక్ హెల్త్ యూనియన్ ఎన్నికలు

పీలేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్-3194 చిత్తూరు జిల్లా పీలేరు తాలూకా నూతన కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. పీలేరులో గురువారం జిల్లా అధ్యక్షుడు ఎ.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ సెక్రటరీ కుసుమకుమారి ఎన్నికల అధికారిగా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్యామల ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పీలేరు తాలూకా నూతన అధ్యక్షుడిగా టి.విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా టి.రెడ్డమ్మ, జి.మునిలక్ష్మి, ఎస్.వెంకటరమణ, జనరల్ సెక్రటరీగా ఆర్.చిన్నప్ప, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.అరుణ, పి.యుగంధర్, ఎన్.పంకజం, కోశాధికారిగా ఆర్.శివప్రసాద్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులను మిగిలిన ఉద్యోగులు అభినందించారు.

కూలీలకు స్థానికంగా ఉపాధి: ఎంపీడీవో

పీలేరురూరల్, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో కూలీలందరికీ స్థానికంగానే ఉపాధి పనులు కల్పిస్తున్నామని పీలేరు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. గురువారం ఆయన పీలేరు మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూలీలు ఎందరున్నా వారివారి గ్రామాల్లోనే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో భాగంగా పనులు కల్పిస్తున్నామని చెప్పారు. పీలేరు మండలం నుంచి ఏ ఒక్కరూ ఇతర ప్రాంతాలకు పనుల కోసం వలసలు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. మండలంలో 7060 జాబ్ కార్డులుండగా ప్రస్తుతం 1200 నుంచి 1330 మంది కూలీలు మాత్రమే రోజువారి పనులకు వస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ ఖాన్ పాల్గొన్నారు.

లోతుగా దుక్కులు చేయాలి: ఏవో

పెద్దమండ్యం, మే 15(ఆంధ్రజ్యోతి): తొలకరి వర్షాలకు పొలాలు లోతుగా దుక్కులు చేయాలని పెద్దమండ్యం ఏవో సురేష్‌బాబు పేర్కొన్నారు. పెద్దమండ్యం లోని రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పొలాలు లోతుగా దున్నడం వల్ల భూమిలో వున్న ఎర్రగొంగలి పురుగు లార్వాలు బయట పడి చనిపోతాయన్నారు. విత్తనం విత్తు తరువాత మొలకెత్తడం సులువుగా వుంటుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల కోసం రైతులు ఈకేవైసీ చేసుకోవాలన్నారు.

న్యాయం చేయాలని కమిషనర్‌కు వినతి

మదనపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలని మదనపల్లె మున్సిపాలిటీలోని 2వ డివిజన్‌లో డైలీ వేజ్ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న రమణమ్మ గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. రోజువారి వేతనంతో పనిచేస్తున్న తనకు ఆప్కాస్ పద్ధతిలోకి మారుస్తామని నమ్మబలికి రూ.70 వేలు తీసుకుని మోసం చేశారని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కమిషనర్‌ను కోరారు.

సికెల్‌సెల్ నిర్మూలనే లక్ష్యం

వాల్మీకిపురం, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన శాఖలన్నీ సమన్వయంతో సమష్టిగా పనిచేస్తూ సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని డాక్టర్ జులేఖాబేగం పేర్కొన్నారు. మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీలో వ్యాధి నిర్మూలనపై సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటలక్ష్మి, డాక్టర్లు సాయిశ్రీ, సనాఆయేషా, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మ జాతర చాటింపు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

మదనపల్లెఅర్బన్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు అవరణంలో వెలసిన కోర్టులో గంగమ్మజాతర చాటింపును గురువారం ఆలయకమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగమ్మకు విశేషంగా అలంకరణ చేశారు. వేపమండలతో ఆలయం అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జూన్ 3, 4 తేదీలో జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంగా ఆలయంలో అమ్మవారి కుటుంబీకులు జోలెపాళెం భవానీ ప్రసాద్, జోలెపాళెం దేవేంద్రలతో దున్నపోతుకు పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలో చాటింపు వేస్తారు. అంతకముందే అమ్మినేని వీధిలోని ఏడు చోట్ల గంగమ్మలకు పూజలు నిర్వహించారు. ఈ 18 రోజులు పట్టణంలోని పుర వీధుల్లో ఇంటింటికి దున్నపోతుకు పూజలు చేస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, కరుణాకర్ నాయుడు సభ్యులు జోలెపాళెం దేవేంద్ర, మార్పురి మహేష్, మల్లికార్జున నాయుడు, చెన్నారెడ్డి, ఆర్.శ్రీనివాసులు నాయుడు, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్ల జాబితా ప్రకటన

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కలికిరి వ్యవసాయ మార్కెట్ కమిటీకి పూర్తి స్థాయి నామినేటెడ్ బోర్డును ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పీలేరు నియోజకవర్గంలోని మూడు కమిటీలకు నెలన్నర క్రితమే చైర్మన్లను ప్రకటించారు. తాజాగా అందులో కలికిరి మార్కెట్ కమిటీ డెరెక్టర్ల జాబితాను ప్రకటించారు. ఈ మార్కెట్ కమిటీ పరిధిలో కలికిరి, కలకడ మండలాలున్నాయి. దీంతో రెండు మండలాల నుంచి డైరెక్టర్లను నామినేట్ చేశారు. గౌరవాధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఛైర్ పర్సన్‌గా జి.మాలతి (కలికిరి), వైస్ చైర్మన్‌గా ఎస్.సనావుల్లా (కలికిరి), పి.తేజకుమార్ (కలికిరి), సి.అస్లామ్ (కలికిరి), బి.వసంత అలియాస్ బి.వసుంధర (కలకడ), వి.ఎస్.మెహర్‌బాను (కలికిరి), పి.రెడ్డెమ్మ (కలికిరి), ఎం.శ్యామల (కలకడ), ఇ.శ్రీనివాసులు (కలికిరి), కె.రెడ్డెమ్మ (కలకడ), టి.నరసమ్మ (కలకడ), ఎం.రాజగోపాల్ రెడ్డి (కలికిరి), ఎస్.ముబారక్ ఆలీ (కలకడ), ఎస్.విశ్వనాథం శెట్టి (కలకడ), సి.రాంబాబు (కలికిరి)లను డైరెక్టర్లుగా నియమించారు. ఇక పదవుల రీత్యా సహకార సంఘాల కోటాలో కలకడ ప్యాక్స్ అధ్యక్షుడిని (ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జి), సర్పంచుల కోటాలో కలకడ మండలం బాలయ్యగారిపల్లె సర్పంచు కె.విశ్వనాథ్‌ను నామినేట్ చేశారు. వీరు కాకుండా వ్యవసాయ శాఖ ఏడీ వాణీశ్రీని, జిల్లా మార్కెటింగ్ అధికారి టి.త్యాగరాజును కూడా డైరెక్టర్లుగా నియమించారు. ఈ మేరకు వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు.

రహంతుల్లా మృతి తీరని లోటు : ఎమ్మెల్యే



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, మే 15 (ఆంధ్రజ్యోతి): కలికిరి మండల మాజీ ఎంపీపీ, మాజీ జడ్పీటీసీ రహంతుల్లా ఆకస్మిక మరణం పార్టీకే కాకుండా తమ కుటుంబానికి కూడా తీరని లోటని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు నలభై ఏళ్లుగా ఆయన తమ వెన్నంటి నడిచారని చెప్పారు. రహంతుల్లాతో వున్న అనుబంధాన్ని ఆయన పలువురితో పంచుకున్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుమారుడు ఖాదర్‌వలీతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని కోరారు. తదనంతరం జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యేతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

భూ రీసర్వే పనులు పకడ్బందీగా చేయాలి

పెద్దమండ్యం, మే 15(ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా భూ రీసర్వే పనులు చేయాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ పేర్కొన్నారు. మండలంలోని ప్రారంభమైన దిగువపల్లి భూముల రీసర్వే ప్రక్రియను గురువారం పరిశీలించారు. అనంతరం దిగువపల్లి సచివాలయంలో తహసీల్దార్ మాట్లాడుతూ దిగువపల్లి పరిధిలో రైతుల 632 ఖాతాలు వుండగా 4150 ఎకరాలు విస్తీర్ణం వున్నట్లు తెలిపారు. పెద్దమండ్యం, తంబళ్లపల్లి మండలాల రీ సర్వే బృందాలు అధికారులు రైతుల సమస్యలేని రీ సర్వేలు చేయాలన్నారు. ఉమ్మడి సర్వే భూములు, భూ సమస్యలు పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. మండల సర్వేయర్ హసీన్‌తాజ్, ఆర్‌ఐ సయ్యద్ ఇమ్రాన్, వీఆర్వోలు రెడ్డికృష్ణ, విశ్వంభరనాయుడు విలేజ్ సర్వేయర్లు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచండి

తంబళ్లపల్లె, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని ఉపాధి ఏపీడీ నందకుమార్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన ఏపీవో అంజనప్పతో కలసి మండలంలోని గంగిరెడ్డిపల్లెలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఉపాధి పనులకు వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఉపాధిలో పండ్ల తోటలు, గడ్డిపెంపకం సాగు చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించి దరఖాస్తు చేయించాలన్నారు. ఉపాధి పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండి కూలీలకు అవసరమైన వాటిని సమకూర్చాలని సూచించారు. ఆయన వెంట జేఈ మహేష్, జీఐఎస్ ఇంజనీరు నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ చాంద్‌బాష ఉన్నారు.

ఝరికోన నిర్వహణపై శ్రద్ధ చూపాలి

కలకడ, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల ప్రజల దాహార్తి తీర్చే ఝరికోన తాగునీటి పథకం నిర్వాహణపై శ్రద్ధచూపాలని అధికారులను పలువురు సభ్యులు కోరారు. బుధవారం ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో బాలయ్యగారిపల్లె సర్పంచ్ విశ్వనాథ్ మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలో పైప్‌లైన్లు దెబ్బతిని ట్యాంకులకు నీరు అందని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఎంపీపీ శ్రీదేవి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతున్న ఉపాధి పథకాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో అబ్దుల్‌రహీం కోరారు. కోన సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 104 సేవలను మారుమూల గ్రామాలకు విస్తరింపజేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఫణికుమార్, ఎంఈవో రామచంద్రారెడ్డి, ఏవో లావణ్య, హెచ్‌వో సుకుమార్‌రెడ్డి, ఏపీవో సుజాత, అధికారులు పాల్గొన్నారు.

కరెంట్ బిల్లు షాక్ కొడుతోంది : కాంగ్రెస్

మదనపల్లె అర్బన్, మే 15(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉక్కపోత కంటే కరెంటు బిల్లు షాక్ కొడుతోందని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే బాషా అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరెంట్ బిల్లును పెంచబోమని చెప్పిన కూటమి ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోలేదని విమర్శించారు.

ప్రజలతో మంత్రి మాటామంతీ

- టీ దుకాణంలో స్థానికులతో మమేకం



ప్రజలతో మమేకమై దుకాణంలో టీ తాగుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మదనపల్లె, మే 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకలబైలులో రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రజలతో మమేకమయ్యారు. బెంగళూరు నుంచి రాయచోటికి వెళ్తున్న సందర్భంగా సరిహద్దు గ్రామమైన చీకలబైలులో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ప్రచార సమన్వయకర్త మల్లికార్జుననాయుడుతో కలిసి దుకాణంలో టీ తాగారు. ఈ సందర్భంగా స్థానికులతో మాటామంతీ కలిపారు. ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది... పథకాలపై ఏమనుకుంటున్నారు... ఇక్కడ ఇబ్బందులు ఏంటని ఆరా తీశారు. చాకలబైలు రోడ్డు, గోకులం షెడ్లపై స్థానికులు ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. మల్లికార్జుననాయుడు మాట్లాడుతూ పదేళ్ల క్రితం మన హయాంలో దోనబైలుకు రోడ్డు ఫార్మేషన్ చేశామని, ఇప్పుడు తారు రోడ్డుగా మారిస్తే 100కు పైగా గ్రామాలకు అనుకూలంగా ఉంటుందని మంత్రికి వివరించారు. రోడ్డుతో పాటు బస్సు సౌకర్యం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

నిమ్మనపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇళ్లు నిర్మించేందుకు అదనంగా రూ.50 వేల నుంచి 70 వేల వరకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మండలంలో దాదాపు 150 మంది లబ్ధిదారులకు ఈ మొత్తం వారి ఖాతాకు జమచేసినా ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించలేదన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బంది వీలైనంత త్వరగా ఇళ్లను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ అమరనాథ్, మాజీ సర్పంచ్ రఫి, రవి పాల్గొన్నారు.

యువ కాపునాడు పార్లమెంటరీ అధ్యక్షుడిగా సీతారాం

కురబలకోట, మే 15 (ఆంధ్రజ్యోతి): యువ కాపునాడు రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షుడిగా ఎస్.సీతారాంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పూల చైతన్యకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని అంగళ్లుకు చెందిన ఆయన గత కొన్నేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా సంఘంలో చురుగ్గా పని చేయడంతో పాటు తనవంతు సహాయ సహకారాలను అందజేశారు. ఆయన చేసిన సేవలను గుర్తించి ఆయనకు పదవిని అప్పగించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆయన మాట్లాడుతూ బలిజల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

మదనపల్లెటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మదనపల్లెలో నిర్వహించనున్న విద్య, వైజ్ఞానిక ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... ఈ నెల 17 నుంచి 26వ తేది వరకు నిర్వహించనున్న ఈ శిక్షణ శిబిరానికి రాష్ట్ర వ్యాప్తంగా వున్న 300 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పట్టణ నాయకులు రమణ, జయబాబు, అఫ్రీద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై సమావేశం

రామసముద్రం, మే 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం మండల సమాఖ్య సభ్యులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ రైతుల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఏవో మోహన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న వ్యవసాయ పద్ధతుల్లో రసాయన ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడడం వలన భూసారం తగ్గి సాగు ఖర్చు పెరుగుతోందన్నారు. దీన్ని నివారించడానికి ప్రకృతి వ్యవసాయం చేయడమే ఏకైక మార్గమని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సాంబశివ, మాస్టర్ ట్రైనర్ బావాజాన్, రమాదేవి పాల్గొన్నారు.

ఆరోగ్యసూత్రాలపై అవగాహన కల్పించాలి

మదనపల్లెటౌన్, మే 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆరోగ్య సూత్రాలపై గ్రామ సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిజియోథెరపి వైద్యులు సంతోష్‌బాబు, రమేష్‌లు మాట్లాడుతూ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ సమావేశంలో ఈవోఆర్డీ అబ్దుల్ షకూర్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.